

అనుమానాస్పదంగా వ్యక్తి మృతి
- కర్ణాటక రాష్ట్రం సైదాపూర్‌లో ఘటన
- మృతుడిది నారాయణపేట జిల్లా కృష్ణ మండలం
- నాలుగు నెలలుగా అత్తగారి ఊరు సైదాపూర్‌లో నివాసం

7

యువ రైతు
బలవన్మరణం
- 'పేట' జిల్లా కృష్ణ మండలం గుడెబల్లూరులో ఘటన

7

తొలగుతున్న.. అడ్డంకులు

- సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి ఆవరణలోని ఓ బ్లాక్‌లో ఈవీఎం గోదాం
- దాంతో ఆ బ్లాక్ ప్లానింగ్ ప్రకారం నిర్మించలేని పరిస్థితి
- కోర్టు సూచనతో త్వరలో ఈవీఎంల తరలింపు
- వినియోగదారుల కోర్టు భవనానికి ప్రత్యామ్నాయం పరిశీలన
- ఆస్పత్రి అందుబాటులోకి వస్తే 1003 పడకలతో అందనున్న అత్యాధునిక సేవలు



మహబూబ్‌నగర్‌లో నిర్మిస్తున్న సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి

మహబూబ్‌నగర్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): మహబూబ్‌నగర్ నడిబొడ్డున చేపట్టిన సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణానికి ఉన్న అడ్డంకులు తొలగుతున్నాయి. కీలకమైన ఐదో బ్లాకు ఇన్నాళ్లు నిర్మాణానికి నోచుకోలేదు. అందులో ఈవీఎం గోదాము ఉండటమే కారణం. దాన్ని మరో భవనంలోకి తరలించి, ఆ స్థానంలో బ్లాకు నిర్మించడానికి అధికార యంత్రాంగానికి, ప్రజాప్రతినిధులకు చాలా ఇబ్బందులు ఎదురయ్యాయి. అది కేంద్ర ఎన్నికల సంఘం పరిధిలో ఉండటం, సున్నితమైన అంశం కావడంతో సరైన డైరెక్షన్ లేకుండా ఏదైనా చేస్తే సమస్యలు ఎదురవుతాయనే ఉద్దేశంతో పద్ధతి ప్రకారం ముందుకెళ్లారు. తాజాగా కోర్టు ఈవీఎం గోదాము తరలించి, ఐదో బ్లాకు నిర్మించాలని సూచించడంతో మార్గం సుగమం కానుంది. కోర్టు ఇచ్చిన డైరెక్షన్ను ఎన్నికల సంఘానికి పంపించి అనుమతి తీసుకున్న తర్వాతనే తరలింపు చేపట్టే అవకాశం ఉంది. ఈ ప్రక్రియ త్వరలోనే పూర్తవుతుందని అధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

అత్యాధునిక వసతులతో..

మొత్తం స్థలం ఆసుపత్రి అవసరాలకు తీసుకోగా.. 8 ఎకరాల్లో ప్రస్తుత భవనాలు పోను మిగతా స్థలంలో పీజీ హాస్టల్ భవనాలు నిర్మించ తలపెట్టారు. కానీ ఐదో బ్లాకును విస్మరించి, మిగతా నాలుగు బ్లాకులతో ప్రారంభించే అవకాశం లేకపోవడం ఇన్నాళ్లు అడ్డంకిగా మారింది. మొత్తం 400 నుంచి 500 మంది కార్మికులు నిత్యం పనిచేస్తూ దాదాపు పూర్తిదశకు తెచ్చారు. భవన నిర్మాణం పకడ్బందీగా ఉండేందుకు క్వాలిటీ కంట్రోల్ విభాగాన్ని కూడా ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. సిమెంట్, స్టీల్ ఇతర సామగ్రి నాణ్యతను చూస్తున్నారు. భవిష్యత్ అవసరాలను తీర్చే విధంగా అత్యాధునిక వసతులను సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో కల్పించనున్నారు. సెంట్రల్ ఏసీ, సెంట్రల్ ఆక్సిజన్ సిస్టమ్, అత్యాధునిక అగ్నిప్రమాద నివారణ సదుపాయాలను కల్పించనున్నారు. బయో మెడికల్ వ్యర్థాల నిర్వహణకు కూడా ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేయనున్నారు.

ఉమ్మడి జిల్లాకు మేలు..

ఉమ్మడి పాలమూరు జిల్లాలో ఇప్పటివరకు ప్రభుత్వ ఆధ్వర్యంలో సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు అందించే ఆసుపత్రి లేదు. దాదాపు 200 కిలోమీటర్ల మేర జాతీయ రహదారి ఉండటం, రెండు

(మిగతా 6లో..)

నాలుగు బ్లాకులు 85 శాతం పూర్తి

అలాగే సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ప్రాంగణంలోనే ఉన్న వినియోగదారుల కోర్టు భవనానికి కూడా ప్రత్యామ్నాయాన్ని పరిశీలిస్తున్నారు. గతంలో ఉన్న జిల్లా కార్యాలయాల భవనాల్లో ఏదో ఒక భవనాన్ని దీనికి కేటాయించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. అయితే ఈవీఎం గోదాం అడ్డంకి తొలగిపోవడంతో త్వరితగతిన ఏర్పాట్లు పూర్తిచేసి.. భవనాన్ని సీఎం రేవంత్‌రెడ్డి చేతులమీదుగా ప్రారంభించనున్నారు. ఇప్పటికే నిర్మించిన నాలుగు బ్లాకుల్లో దాదాపు 85 శాతం ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఐదో బ్లాకు నిర్మాణ సమయంలోనే మిగతా పెండింగ్ పనులను పూర్తి చేయనున్నారు. టీజీఎంఎస్ఐడీసీ ఆధ్వర్యంలో పనులు జరుగుతున్నాయి. ఆసుపత్రి అందుబాటులోకి వస్తే ఉమ్మడి పాలమూరు జిల్లా ప్రజలకు సూపర్ స్పెషాలిటీ సేవలు అందుబాటులోకి వస్తాయి. ఇప్పుడున్న ప్రభుత్వ జనరల్ దవాఖానాపై భారం కూడా తగ్గే అవకాశాలు ఉన్నాయి.

రూ. 178.30 కోట్లతో పనులు..

గత ప్రభుత్వ హయాంలో మహబూబ్‌నగర్ బస్టాండ్‌కు సమీపంలోనే ఉన్న కలెక్టరేట్ భవనాన్ని ఇక్కడి నుంచి భూత్పూరు రోడ్డుకు తరలించారు. అక్కడ నూతన భవనాన్ని నిర్మించారు. ఈ క్రమంలో అత్యంత అందుబాటులో ఉన్న 16.04 ఎకరాల్లో సుమారు 8 ఎకరాల్లో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి భవానాన్ని నిర్మించాలని నిర్ణయించారు. రూ.178.30 కోట్లు కేటాయిస్తూ 1,003 పడకలతో నిర్మించాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.



ఆస్పత్రికి కేటాయించిన స్థలంలో ఉన్న ఈవీఎం గోదాం



మద్దూర్ పట్టణం

పరుగులు పెట్టనున్న అభివృద్ధి

- నారాయణపేట జిల్లాలోని పురపాలికలకు రూ.95 కోట్లు మంజూరు
- పాలకవర్గాలు లేనందున ఫాస్ట్‌ట్రాక్ పద్ధతిలో అనుమతులు

మద్దూర్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట జిల్లాలోని పురపాలికల్లో అభివృద్ధి పనులకు ప్రభుత్వం ప్రత్యేక నిధులు మంజూరు చేసింది. రెండు నెలల క్రితం ఆయా మునిసిపాలిటీల నుంచి ప్రతిపాదనలను స్వీకరించింది. నాలుగు మునిసిపాలిటీలకు రూ.95 కోట్లు ఇవ్వగా, ముఖ్యమంత్రి నియోజకవర్గంలో కొత్తగా ఏర్పడ్డ మద్దూరుకు అత్యధికంగా రూ.50 కోట్లు ఇచ్చింది. కోస్గి, నారాయణపేట, మక్తల్ మునిసిపాలిటీలకు రూ.15 కోట్ల చొప్పున రూ.45 కోట్లు మంజూరయ్యాయి.

ప్రధాన సమస్యల పరిష్కారం

మద్దూరు మునిపాలిటీకి ప్రభుత్వం అత్యధికంగా రూ.50 కోట్లు మంజూరు చేసింది. ఈ నిధులతో పట్టణ వాసులు ఎంతోకాలంగా ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారం కానున్నాయి.

\- శ్రీకాంత్, కమిషనర్, మద్దూర్

చేపట్టనున్న పనులు ఇవే..

నిధుల లేమితో కొంత కాలంగా ఆగిన అభివృద్ధి మళ్లీ ప్రారంభం కానుంది. ఎన్నో ఏళ్లుగా పేరుకున్న సమస్యలు పరిష్కారం కానుండటంతో ఆయా పురపాలికల ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మద్దూరులో రూ.35 కోట్లతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు చేపట్టనుండగా, రూ.15 కోట్లతో తాగునీరు, ఇతర పనులు చేపట్టనున్నారు.

- నారాయణపేటలో రూ.8.90 కోట్లతో సీసీ రోడ్లు, డ్రైనేజీలు, కల్వర్టులు, రూ.2 కోట్లతో డివైడర్‌తో కూడిన రోడ్డు విస్తరణ, సెంట్రల్ లైటింగ్, ఎర్రగుట్ట చౌరస్తా జంక్షన్ బ్యుటిఫికేషన్ పనులు చేపట్టనున్నారు. రూ1.50 కోట్లతో పళ్ల ప్రాంతంలోని పార్క్ అభివృద్ధి, రూ.2 కోట్లతో పారిశుధ్య పనులు, యంత్రాలు, వాహనాల కోసం వెచ్చించనున్నారు.
- కోస్గి పట్టణంలో రూ.3.50 కోట్లతో మునిసిపాటీ కార్యాలయ భవనం, కొడంగల్, మద్దూర్ రోడ్లలో పార్కుల అభివృద్ధి పనులు చేపట్టనున్నారు. ఏటీసీ సెంటర్ నిర్మాణానికి రూ.60 లక్షలు, పారిశుధ్య పనుల వాహనాల కొనుగోలుకు రూ.కోటి, మొబైల్ టాయిలెట్లు, వాహనాల కొనుగోలుకు రూ.50 లక్షలు, అంతర్గత సీసీ రోడ్లు, లింక్ రోడ్ల కోసం రూ.2.65 కోట్లు, స్వశక్తి భవనాలకు రూ.20 లక్షలు, వీధీ దీపాలు, ప్రకటనల హోర్డింగ్‌లకు రూ.50 లక్షలు, బహిర్భూమి సాధక గోడౌన్ నిర్మాణానికి రూ.30 లక్షలు ఖర్చు చేయనున్నారు.
- మక్తల్ మునిసిపాలిటీకి మంజూరైన రూ.15ను కోట్ల వివిధ సమస్యల పరిష్కారంతో పాటు పట్టణ సుందరీకరణకు వినియోగించనున్నారు. ఈ నిధులతో పురపాలికల రూపురేఖలు మారనున్నాయి. మునిసిపాలిటీల్లో పాలక వర్గాలు లేకపోవడంతో ప్రభుత్వం ఫాస్ట్‌ట్రాక్ పద్ధతిలో పరిపాలన అనుమతులు ఇచ్చే అవకాశముంది.

యుద్ధం నేపథ్యంలో
హ్యాపీజర్నీ
- ఇండియా, పాకిస్తాన్ మధ్య జరిగిన వార్‌లోని ఓ సన్నివేశం ఆధారంగా సినిమా 6
- 50 శాతానికి పైగా పాలమూరు జిల్లాలోని పలు ప్రాదేశాల్లో చిత్రీకరణ
- ఈనెల 21న విడుదల
- డైరెక్టర్ చైతన్య కొండ

వ్యక్తిపై హత్యాయత్నం
- స్కార్పియోతో ఢీకొట్టి రాడ్డుతో దాడి 6

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా చికెన్ సెంటర్స్ అసోసియేషన్
నేటి చికెన్ ధరలు

ఫామ్ లైవ్	: 110.00
హోల్ సేల్	: 122.00
డ్రెస్డ్	: 191.00
స్కిన్ లెస్	: 218.00

రసవత్తరంగా క్రీడా పోటీలు
- కొనసాగుతున్న జోనల్ లెవల్ గేమ్స్ అండ్ స్పోర్ట్స్ 7



జడ్చర్ల మండలం చిట్టిబోయిన్‌పల్లిలో కబడ్డీ ఆడుతున్న బాలికలు

ఉబికిన గంగ
- మోటారు వేయకుండానే వస్తున్న నీళ్లు

జడ్చర్ల, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): జడ్చర్ల మండలం గంగాపురంలోని రేణుకా ఎల్లమ్మ దేవాలయ ప్రాంగణంలోని బోరుబావిలోంచి నీళ్లు ఉబికి వస్తున్నాయి. ఇటీవల కురిసిన వర్షాలతో భూగర్భజలాలు పెరగడంతో మోటర్ ఆన్ చేయకుండానే నీళ్లు పైకి వస్తున్నాయి. ఇది చూసి భక్తులతో పాటు గ్రామస్థులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



బోరులోంచి ఉబికి వస్తున్న నీళ్లు

అలంకరణ తొలగింపు తేదీ పొడిగింపు

చిన్నచింతకుంట, నవంబరు7 (ఆంధ్రజ్యోతి): చిన్నచింతకుంట మండలం అమ్మాపూర్ గ్రామ సమీపంలో వెలసిన కురుమూర్తి వేంకటేశ్వర స్వామి వారి ఆభరణాల అలంకార తొలగింపు తేదీని పొడగించినట్లు అలయ ఈవో మహేశ్వర్‌రెడ్డి శుక్రవారం ఆంధ్రజ్యోతికి తెలిపారు. ఆభరణాలను శుక్రవారం తొలగించాల్సి ఉందన్నారు. కానీ భక్తుల విజ్ఞప్తి మేరకు ఈనెల 10 వరకు పొడిగించినట్లు ఆయన తెలిపారు.



అలంకరణలో స్వామివారు

వందేమాతరం సామూహిక గీతాలాపన
- జాతీయ గీతాన్ని రచించి 150 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా..
- పాల్గొన్న అన్ని శాఖల అధికారులు



వందేమాతరం గీతాలాపనలో పాల్గొన్న కలెక్టర్ విజయేందిర బోయి, అదనపు కలెక్టర్ శివేంద్ర పతాప్ తదితరులు

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): వందేమాతరం జాతీయ గీతాన్ని మహాకవి బంకిమ్ చంద్ర చటర్జీ రచించి 150 సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా ప్రభుత్వ ఆదేశాల మేరకు శుక్రవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం(కలెక్టరేట్)లో గీతాన్ని సామూహికంగా ఆలపించారు. కలెక్టర్ విజయేందిర బోయి ఆధ్వర్యంలో అన్ని శాఖల అధికారులు, సిబ్బంది స్వచ్ఛందంగా పాల్గొని దేశభక్తి భావాన్ని చాటారు. వందేమాతరం గేయం దేశభక్తి భావాన్ని పెంపొందిస్తుందని, దేశ చరిత్రలో ఈ గేయం విశేష ప్రాధాన్యం కలిగి ఉందని కలెక్టర్ అన్నారు. కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్, రెవెన్యూ అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్, కలెక్టరేట్ ఏవో సువర్ణరాజ్, అన్ని శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి



కోస్గి హాస్టల్‌లో భోజనాన్ని పరిశీలిస్తున్న సుబ్బలక్ష్మి

- షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ సుబ్బలక్ష్మి
- గుండుమాల్, కోస్గి బాలికల సాంఘిక సంక్షేమ వసతి గృహాల తనిఖీ

కోస్గి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ వసతి గృహాల్లో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ఎస్.సుబ్బలక్ష్మీ చెప్పారు. శుక్రవారం నారాయణపేట జిల్లా గుండుమాల్, కోస్గి పట్టణాల్లోని బాలికల సాంఘిక సంక్షేమ వసతి గృహాలను ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయా వసతి గృహాల్లో నిత్యావసర సరుకులు, వంట గది, మరుగుదొడ్లు, స్నానపు గదులను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో కలిసి అల్పాహారం తీసుకున్నారు. పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్‌నకు సంబంధించి సంబంధిత కళాశాలల హాస్టల్ వెల్ఫేర్ నిధులను వినియోగించి విద్యార్థుల బ్యాంకు ఖాతాల సీడింగ్, ఆధార్ సీడింగ్‌లను త్వరగా చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో నారాయణపేట షెడ్యూల్ కులాల అధికారి అబ్దుల్‌ఖలీల్‌తో పాటు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

మానవ అక్రమ రవాణా నేరం
- సీనియర్ సివిల్ న్యాయాధికారి ఈశ్వరయ్య



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ న్యాయాధికారి ఈశ్వరయ్య

మహబూబ్‌నగర్, నవంబరు7(ఆంధ్రజ్యోతి): మానవ అక్రమ రవాణా వంటి నేరాలు సమాజానికి మచ్చతెస్తాయని సీనియర్ సివిల్ న్యాయాధికారి ఈశ్వరయ్య అన్నారు. వీటిపై పోలీసులు చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్, బాండెడ్ లేబర్ యాక్ట్‌పై జిల్లా పోలీసు కార్యాలయంలో శుక్రవారం ఒకరోజు వర్క్‌షాప్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన సీనియర్ సివిల్ న్యాయాధికారి, ఎస్పీ జానకి మాట్లాడారు. ఇప్పటికే మానవ అక్రమ రవాణా జరుగకుండా పోలీస్ బృందాలు పని చేస్తున్నాయని చెప్పారు. బాధితులకు న్యాయం చేకూర్చేదిశగా చర్యలు తీసుకోవాలన్నారు. బాలకార్మిక వ్యవస్థను కూడా నిర్మూలించాల్సిన అవసరం ఉందన్నారు. ఐజేఎం తెలంగాణ ప్రతినిధులు పోలీస్ అధికారులకు ట్రైనింగ్ ఇచ్చారు. కార్యక్రమంలో డీఎస్పీలు వెంకటేశ్వర్లు, రమణారెడ్డి, సీడబ్ల్యూసీ ఛైర్మన్ నయీముద్దీన్, డీసీపీఓ సభ్యులు, ఐజేఎం ప్రతినిధులు, ఇన్‌స్పెక్టర్లు, ఎస్ఐలు పాల్గొన్నారు.

ఆటోను ఢీకొట్టిన ఆయిల్ ట్యాంకర్
- ఇద్దరు యువకుల దుర్మరణం
- జోగుళాంబ గద్వాల జిల్లా వడ్డేపల్లి మండలం జూలకల్ స్టేజీ సమీపంలో ఘటన 6

సకాలంలో బస్సులు నడపాలని ధర్నా 6

300 కిలోల మొసలిని బంధించిన యువకులు



మొసలిని ఫారెస్టు అధికారులకు అప్పగిస్తున్న యువకులు

కొత్తకోట, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : వనపర్తి జిల్లా కొత్తకోట మండలం సంకిరెడ్డిపల్లి గ్రామంలో 300 కిలోల మొసలిని యువకులు శుక్రవారం బంధించారు. ఆ గ్రామ ఇళ్ల సమీపంలోని బీడు భూముల్లో సంచరిస్తున్న మొసలిని గమనించిన మహిళలు యువకులకు సమాచారం ఇచ్చారు. మొసలిని పరిశీలించిన యువకులు ఫారెస్టు అధికారులకు సమాచారం ఇచ్చారు. ఈ మేరకు చాకచక్యంగా తాళ్లతో బంధించి ఫారెస్టు అధికారి నాగశేషికి అప్పగించగా జూరాల ప్రాజెక్టులో విడిచి పెట్టడానికి తీసుకెళ్లారు. మొసలిని బంధించిన వారిలో శేఖర్ యాదవ్, రమేష్, పెద్ద రాములు, మహేష్, మొగిలన్న, విజయ్, చలపతి, కృష్ణయ్య, వడ్డె శేఖర్ తదితరులు ఉన్నారు.

ఆటోను ఢీకొట్టిన ఆయిల్ ట్యాంకర్

» ఇద్దరు యువకుల దుర్మరణం



మహేష్ (ఫైల్)



విశ్వాస్ (ఫైల్)

వడ్డేపల్లి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లా వడ్డేపల్లి మండల పరిధిలోని జూలకల్ స్టేజీ సమీపంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మహేష్(20), విశ్వాస్(18) అనే యువకులు మృతి చెందినట్లు ఎస్ఐ నాగశేఖర్ రెడ్డి తెలిపారు. పచర్ల గ్రామానికి చెందిన మహేష్, విశ్వాస్ ఆటోలో టమాట గంపలు వేసుకొని శాంతినగర్‌లో జరిగిన సంతకు వచ్చారు. సంతలో టమాట అమ్ముకొని తిరిగి ఆటోలో సొంత గ్రామానికి బయలుదేరారు. మార్గమధ్యలో జూలకల్ స్టేజీ వద్ద ఆయిల్ ట్యాంకర్ వీరి ఆటోను ఢీకొట్టడంతో ఆ ఇద్దరు యువకులు అక్కడికక్కడే మృతి చెందారు. సంఘటనా స్థలానికి సీఐ టాటాబాబు, ఎస్ఐ నాగశేఖర్ రెడ్డి చేరుకొని ప్రమాదానికి గురైన ఆటోను పరిశీలించారు. ప్రమాదానికి కారణమైన ఆయిల్ ట్యాంకర్ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నామని ఎస్ఐ తెలిపారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం అలంపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడు మహేష్ తండ్రి యేసు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

షార్ట్ సర్క్యూట్‌తో లారీ దగ్ధం



శంషాబాద్ కూరగాయల మార్కెట్ వద్ద లారీలో చెలరేగిన మంటలు

శంషాబాద్‌రూరల్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : షార్ట్ సర్క్యూట్‌తో లారీ దగ్ధమైన సంఘటన శుక్రవారం ఆర్జీఐఏ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ బాల్‌రాజ్ తెలిపిన వివరాల ప్రకారం... మహబూబ్‌నగర్‌కు చెందిన డ్రైవర్ మహ్మద్ సద్దాం లారీ(టీఎస్ 05 యూబీ 4389)లో సజ్జల సీడ్స్‌ను లోడ్ వేసుకుని మేడ్చల్ నుంచి కర్ణాటకు తీసుకెళ్తున్నాడు. మార్గమధ్యలో శంషాబాద్ మున్సిపల్ పరిధిలోని కూరగాయల మార్కెట్ ఫ్లైఓవర్ మీదికి రాగానే లారీ ఇంజన్‌లో నుంచి మంటలు వస్తున్నాయని బైకు మీద వెళ్తున్న ఓ వ్యక్తి డ్రైవర్‌కు తెలిపాడు. వెంటనే లారీ పక్కకు ఆపి ఫైర్ స్టేషన్‌కు కాల్ చేశారు. ఫైర్ సిబ్బంది వచ్చే లోపే లారీ ముందు భాగం పూర్తిగా కాలిపోయింది. లారీలో ఉన్న సజ్జల విత్తనాలు సగం దగ్ధమైనట్లు డ్రైవర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. షార్ట్ సర్క్యూట్‌తోనే లారీలో మంటలు వచ్చినట్లు పోలీసులు భావించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యుద్ధం నేపథ్యంలో 'హ్యాపీజర్నీ'


- సినిమా డైరెక్టర్ చైతన్య కొండ



సమావేశంలో మాట్లాడుతున్న డైరెక్టర్ చైతన్య కొండ, చిత్రంలో హీరో, యూనిట్ సభ్యులు

మహబూబ్‌నగర్ న్యూటౌన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ఇండియా, పాకిస్తాన్‌ల మధ్య జరిగిన యుద్ధంలోని ఓ సన్నివేశం ఆధారంగా 'హ్యాపీజర్నీ' సినిమా తీసినట్లు డైరెక్టర్ చైతన్య కొండ తెలిపారు. మహబూబ్‌నగర్ ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం సినిమా హీరో హరిహరన్ గోసెతో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దాదాపు 50 శాతానికి పైగా సినిమాను పాలమూరు జిల్లాలోని పలు ప్రదేశాల్లో చిత్రీకరించినట్లు తెలిపారు. ఈనెల 21న సినిమాను విడుదల చేస్తున్నామని, ప్రేక్షకులు ఆదరించాలని కోరారు. చిత్రం విజయవంతం అయితే మహబూబ్‌నగర్ జిల్లాలో సినిమా షూటింగ్‌లకు దర్శక, నిర్మాతలు ఆసక్తి చూపుతారన్నారు. సొంత జిల్లాలో సినిమాను చిత్రీకరించడం, ప్రమోట్ చేయడం సంతోషంగా ఉందన్నారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలోని మయూరి పార్క్, సోమశిల, హన్వాడ, ధన్వాడ, నారాయణపేటలోని పలు ప్రాంతాలు సినిమా చిత్రీకరణకు అనువైన ప్రాంతాలని తెలిపారు. ఎక్కువ మంది నటీనటులు మన జిల్లాకు చెందిన వారే అన్నారు. విలన్‌గా కొండ బాలయ్య అద్భుతంగా నటించారన్నారు.

రాష్ట్ర కళా ఉత్సవ్‌కు న్యాయ నిర్ణేతగా మహేష్ నియామకం



పడకంటి మహేష్

కొల్లాపూర్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : పాఠశాల విద్యాశాఖకు చెందిన సమగ్ర శిక్ష తెలంగాణ ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న రాష్ట్ర స్థాయి కళా ఉత్సవ్ 2025కు విజువల్ ఆర్ట్స్ విభాగ న్యాయ నిర్ణేతగా పడకంటి మహేష్‌ను నియమించారు. ప్రస్తుతం పడమటి మహేష్ పాలమూరు విశ్వ విద్యాలయం పీజీ సెంటర్ కొల్లాపూర్ తెలుగు విభాగం శాఖలో ప్రిన్సిపాల్ డాక్టర్ మార్క్ పోలోనియస్ ఆధ్వర్యంలో పీహెచ్‌డీ విద్యార్థిగా ఉన్నారు. రాష్ట్ర స్థాయి కళా ఉత్సవ్-2025కు విజువల్ ఆర్ట్స్ విభాగ న్యాయ నిర్ణేతగా ఏఎం క్యాలీగ్రఫీ స్టూడియో వ్యవస్థాపకుడు పడమటి మహేష్‌ను డాక్టర్ ఈ నవీన్ నికోలస్ (రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్, సమగ్ర శిక్ష) ఉత్తర్వుల ప్రకారం నియామకం చేశారు. విజువల్ ఆర్ట్స్ సోలో 2డీ, గ్రూప్, సోలో 3డీ విభాగాలకు ఆయన న్యాయ నిర్ణేతగా వ్యవహరించనున్నారు. ఈ పోటీలు నవంబరు 6, 7వ తేదీల్లో హైదరాబాద్ రాజేంద్రనగర్‌లో టీఎస్ఐఆర్‌టీలో జరగనున్నాయి. మహేష్ క్యాలీగ్రఫీ, విజువల్ ఆర్ట్స్ కళా రంగాల్లో గత 18 సంవత్సరాలుగా విశేష కృషి చేస్తున్నారు.

రైతులను ఏమార్చి.. దళారులకు మేలు చేకూర్చి..

» స్లాట్ బుకింగ్‌లో సీసీఐ అధికారుల పనితీరుపై ఆగ్రహం

» చెప్పిన సమయానికి ముందే స్లాట్స్ తెరవడంతో మోసపోయిన రైతులు



వరసిద్ధి వినాయక కాటన్ మిల్లు కొనుగోలు కేంద్రం వద్ద పత్తి వాహనాలు

అలంపూరుచౌరస్తా, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): కపాస్ యాప్ ద్వారా బుకింగ్ చేసుకున్నాకే రైతు తన పత్తిని కొనుగోలు కేంద్రానికి తీసుకెళ్లాలి. ఇందుకోసం సీసీఐ అధికారులు ఒక రోజు ముందుగానే స్లాట్స్ ఓపెన్ చేస్తారు. ఇదే విషయాన్ని రైతులకు ముందుగానే ఫలానా సమయంలో స్లాట్ బుకింగ్ చేసుకోవాలని పేపర్ ప్రకటన, వాట్సాప్ గ్రూప్‌లలో, వ్యవసాయ విస్తరణ అధికారుల ద్వారా సమాచారాన్ని రైతులకు చేరవేస్తారు. సరిగ్గా ఇదే పంథాలో గురువారమే శుక్రవారం మధ్యాహ్నం 12 నుంచి 12.10గంటల వరకు అంటే పదినిమిషాలు మాత్రమే శ్రీవరసిద్ధి వినాయక కాటన్ మిల్లులోని సీసీఐ కొనుగోలు సెంటర్‌కు సంబంధించిన స్లాట్స్ ఓపెన్ అవుతాయని మార్కెట్ అధికారులు సమాచారాన్ని రైతులకు చేరవేశారు. దీంతో అలంపూరు నియోజకవర్గంలోని 8 మండలాల రైతులు చేతిలో మొబైల్‌ఫోన్లు పెట్టుకుని, ఫోన్లులేనివాళ్లు యువకుల వద్ద పడిగాపులు పడి 12గంటలకు కపాస్ యాప్ ఓపెన్ చేస్తే... స్లాట్స్ క్లోజ్ అని చూపింది. చాలాసేపు ఎదురు చూసినా ఫలితం రాకపోవడంతో మార్కెట్ కార్యాలయానికి వెళ్లి ఆరా తీస్తే అసలు విషయం బయటపడింది. వచ్చిన రైతుల ఎదుటే సీసీఐ అధికారి రాహుల్‌కు ఫోన్‌లో ఆరా తీయగా 11.20గంటలకే స్లాట్స్ ఓపెన్ చేశామన్నారు. అయితే, అప్పటికే సోమవారం నుంచి అయిదు రోజులకు సరిపడా స్లాట్స్ బుకింగ్ అయ్యాయని సీసీఐ అధికారులు తెలపడంతో రైతులు నిరాశకు లోనయ్యారు. స్లాట్స్ కోసం వారం రోజులుగా ఎదురు చూస్తున్నామని, తీరా టైం చెప్పి మరో టైంకు స్లాట్స్ ఓపెన్ చేయడం దళారులకు మేలు చేసేందుకే రైతులను ఏమార్చారని మార్కెట్ సెక్రటరీ ఎల్లస్వామిపై మండిపడ్డారు. సీసీఐ అధికారులు చెప్పిన సమయమే రైతులకు తెలిపామని, తీరా మాకు చెప్పకుండానే 11 తర్వాత స్లాట్స్ ఓపెన్ చేశారని సెక్రటరీ 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. ఇలా చేశారనే కలెక్టర్‌కు లేఖ రాశామని, గురువారమే సీసీఐ అధికారి రాహుల్‌ను కలెక్టర్ పిలిచి మందలించినట్లు సెక్రటరీ తెలిపారు. కాగా, మిల్లు యజమానులు, సీసీఐ అధికారులు కుమ్మక్కై దళారుల కోసమే ఈపని చేశారని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

సకాలంలో బస్సులు నడిపించాలి

» నారాయణపేట ఆర్టీసీ డిపో ముందు విద్యార్థుల ధర్నా



డిపో ముందు ధర్నా చేస్తున్న విద్యార్థులు

నారాయణపేట, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : విద్యాసంస్థల సమయానికి అనుగుణంగా బస్సు సర్వీసులు నడిపించాలని నారాయణపేట జిల్లా, దామరగిద్ద మండలంలోని వత్తుగుండ్ల విద్యార్థులు ఆందోళనకు దిగారు. పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో శుక్రవారం నారాయణపేట ఆర్టీసీ డిపో ముందు ధర్నా చేశారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ జిల్లా సహాయ కార్యదర్శి వెంకటేశ్ మాట్లాడారు. వత్తుగుండ్ల గ్రామం నుంచి 150 మందికి పైగా విద్యార్థులు విద్యాభ్యాసం కోసం ప్రతీ రోజు జిల్లా కేంద్రానికి వస్తున్నారని తెలిపారు. కానీ విద్యాసంస్థల సమయానికి ఆర్టీసీ బస్సు నడపకపోవడంతో ఇబ్బంది పడుతున్నారన్నారు. ఉదయం 6:30 గంటలకే బస్సు వస్తుండటంతో ఉదయం పూట టిఫిన్ కూడా చేయకుండా రావాల్సి వస్తోందని తెలిపారు.

రాత్రి 8 గంటలకు బస్సులో ఊరికి చేరుకుంటుండటంతో చదువుకోవడానికి సమయం కూడా దొరకడం లేదన్నారు. ఇప్పటి కైనా ఆర్టీసీ అధికారులు స్పందించి విద్యాసంస్థల సమయానికి అనుగుణంగా ప్రత్యేక బస్సు సర్వీసులు నడిపించలని డిమాండ్ చేశారు. ధర్నాలో పీడీఎస్‌యూ జిల్లా కోశాధికారి మహేశ్, నాయకులు రమేశ్, గ్రామ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు వికాస్, అయ్యప్పలతో పాటు విద్యార్థులు శ్రీకాంత్, శివ, వెంకటేష్, రాధిక, మౌనిక, శిరీష తదితరులు పాల్గొన్నారు.

పీఎంశ్రీ బడులకు క్రీడా, యోగా శిక్షకులు

» తాత్కాలిక పద్ధతిన నియామకానికి గ్రీన్ సిగ్నల్



కొత్తకోటలోని కేజీబీవీ పాఠశాలల్లో యోగా చేస్తున్న విద్యార్థినిలు (ఫైల్)

వనపర్తి విద్యా విభాగం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల్లో పేద విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్యను అందించేందుకు కేంద్ర ప్రభుత్వం పీఎంశ్రీ (ప్రధానమంత్రి స్కూల్ ఫర్ రైసింగ్ ఇండియా)పథకాన్ని అమలు చేస్తోంది. ఈ పథకానికి ఎంపిక చేసిన పాఠశాలలకు ప్రత్యేక నిధులను విడుదల చేసి, కార్పొరేట్‌స్థాయి సదుపాయాలు, డిజిటల్ తరగతి గదులు, ప్రయోగశాలలను ఏర్పాటు చేసింది. ఆయా పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన విద్యాబోధనతో పాటు, ఒత్తిడిని దూరం చేసేందుకు యోగా నేర్పించేందుకు ఏర్పాట్లు చేస్తోంది. దీంతో పాటు మానసిక ఉల్లాసం, శారీరక దృఢత్వం కోసం క్రీడల్లో శిక్షణ ఇవ్వనున్నది. అందుకోసం అవసరమైన శిక్షకుల నియామకానికి నిధులు కేటాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులను జారీ చేసింది. అలాగే కళలపై ఆసక్తి ఉన్న విద్యార్థులకు అవసరమైన సదుపాయాలు కల్పిస్తోంది. ఇప్పటికే కొన్ని పీఎంశ్రీ పాఠశాలలకు సంగీత వాయిద్య పరికరాలను పంపిణీ చేసింది. అలాగే విద్యార్థుల్లో ఆత్మస్థైర్యాన్ని పెంపొందించేందుకు కరాటే శిక్షణ ఇవ్వనున్నారు. ఇందుకోసం వనపర్తి జిల్లా వ్యాప్తంగా ఉన్న 21 పీఎంశ్రీ పాఠశాలల్లో శిక్షకులను తాత్కాలిక ప్రాతిపదికన నియమించి, పారితోషికం చెల్లించేందుకు ప్రభుత్వం నిధులను కేటాయించింది.

రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు గద్వాల విద్యార్థినులు

గద్వాల అర్బన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు గద్వాల మైనార్టీ రెసిడెన్షియల్ స్కూల్ విద్యార్థినులు అజ్మబీబేగం, శమీనా ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ భవాని తెలిపారు. పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో వారిని ప్రిన్సిపాల్‌తో పాటు ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్ రాధ అభినందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ నారాయణపేట జిల్లా కోస్గి మండలంలో ఈ నెల 8 నుంచి 10 వరకు నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి అండర్-17 హ్యాండ్‌బాల్ పోటీల్లో ఇద్దరూ పాల్గొంటారని తెలిపారు.



విద్యార్థినులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్

మొరం తరలిస్తున్న టిప్పర్ల పట్టివేత

ఊట్కూర్/బాలానగర్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : అనుమతి లేకుండా అక్రమంగా మొరం(మట్టి) తరలిస్తున్న రెండు టిప్పర్లను గురువారం రాత్రి పోలీసులు పట్టుకుని కేసు నమోదు చేశారు. నారాయణపేట జిల్లా ఊట్కూర్ ఎస్ఐ రమేష్ కథనం ప్రకారం... మండలంలోని తిప్రాస్‌పల్లి గ్రామ శివారులో పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా అక్కడి నుంచి భారత్ బెంజ్‌కు చెందిన రెండు మొరం టిప్పర్లు వచ్చాయి. వాటిని ఆపి పోలీసులు తనిఖీ చేశారు. అందులో మొరం కనిపించడంతో అనుమతి పత్రాలు అడగగా డ్రైవర్ రాజు లేవని చెప్పాడు.

ఇతర వివరాలు అడుగగా, కొండారెడ్డిపల్లి నుంచి ఊట్కూర్‌కు మొరం తరలిస్తున్నట్లు తెలిపాడు. అలాగే ఓబ్లాపూర్ గ్రామ స్టేజీ వద్ద మొరం నింపుకొని వస్తున్న భారత్‌బెంజ్‌కు చెందిన మరో టిప్పర్ వస్తుండటంతో తనిఖీ చేశారు. మొరం ఉండటంతో పోలీసులు అనుమతి పత్రాలను అడగటంతో డ్రైవర్ రాంచందర్ లేవని చెప్పాడు. వివరాలు అడగగా దామరగిద్ద నుంచి పెద్దపొర్ల గ్రామానికి తరలిస్తున్నామన్నారు. అనంతరం రెండు టిప్పర్లను పోలీస్‌స్టేషన్‌కు తరలించి, కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

● బాలానగర్ మండల కేంద్రంలో పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పోలీసులు ఎలాంటి అనుమతులు లేకుండా మొరం తరలిస్తున్న ఓ టిప్పర్‌ను అదుపులోకి తీసుకున్నారు. టిప్పర్ డ్రైవర్‌ను అనుమతి పత్రాలు ఉన్నాయా అని ప్రశ్నించగా తన వద్ద ఎలాంటి పత్రాలు లేవని తెలిపాడు. దీంతో టిప్పర్‌ను పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఫరూక్‌నగర్ మండలం కాశిరెడ్డిగూడ గ్రామానికి చెందిన తోట మల్లేష్ డ్రైవర్ కం ఓనర్‌గా పనిచేస్తున్నట్లు విచారణలో తేలిందని పోలీసులు వెల్లడించారు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ లెనిన్ తెలిపారు.

వ్యక్తిపై హత్యాయత్నం

» స్కార్పియోతో ఢీకొట్టి, రాడ్డుతో దాడి

అలంపూర్ నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లా, అలంపూర్ మండలంలోని క్యాతూరు శివారులో ఓ వ్యక్తిపై హత్యాయత్నం జరిగింది. ఉండవెల్లి మండలంలోని మారమునగాల గ్రామానికి చెందిన వెంకటేశ్ గురువారం క్యాతూర్‌లోని కెనెరా బ్యాంకుకు వెళ్లాడు. అక్కడ పని ముగించుకొని మధ్యాహ్నం ద్విచక్రవాహనంపై తిరుగు ప్రయాణమయ్యాడు. గ్రామ సమీపంలోని చెరువు కట్ట వద్దకు రాగానే స్కార్పియోలో వచ్చిన గుర్తు తెలియని ఆరుగురు దుండగులు వెంకటేశ్ వెళ్తున్న బైక్‌ను ఢీకొట్టారు. కిందపడిన అతడిపై రాడ్డుతో దాడి చేయడంతో స్పృహ కోల్పోయిన అతడిని అక్కడే వదిలేసి పరారయ్యారు. రాత్రి 10 గంటల సమయంలో అతడిని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో, వారు తీవ్రంగా గాయపడిన వెంకటేశ్‌ను కర్నూలు ఆసుపత్రికి తరలించారు. విషయంపై పోలీసులను సంప్రదించగా దాడి ఘటన వాస్తవమని, బాధితుడు ఒక గొడవకు మధ్యవర్తిత్వం వహించాడని, ఆ నేపథ్యంలోనే దాడి జరిగిందని తెలిపారు. దాడికి పాల్పడిన నిందితులను గుర్తించి అరెస్టు చేసి శుక్రవారం రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ వెంకటస్వామి తెలిపారు.

హత్యాయత్నం కేసులో ఐదుగురికి రిమాండ్

» సీఐ బి.నాగార్జున



హత్యాయత్నం కేసు నిందితులు

కల్వకుర్తి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా, కల్వకుర్తి పట్టణ పరిధిలోని సంజాపూర్ గ్రామంలో జరిగిన హత్యాయత్నం కేసులో ఐదుగురు నిందితులను అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు కల్వకుర్తి సీఐ బి.నాగార్జున తెలిపారు. ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కల్వకుర్తి పట్టణ పరిధిలోని సంజాపూర్ గ్రామానికి చెందిన గుర్రం మల్లేశ్‌కు, వెల్దండ మండలం చెర్కూర్‌కు చెందిన శిరీషలకు రెండేళ్ల క్రితం వివాహమైంది. మల్లేశ్ మరో మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకొని, భార్యను పట్టించుకోకపోవడంతో ఇరు కుటుంబాల మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో మల్లేశ్ తండ్రి గుర్రపు జంగయ్య, తల్లి ఆలివేల, తమ్ముడు పరమేశ్‌లపై ఈ నెల 5న వెల్దండ మండలంలోని చెర్కూర్ గ్రామానికి చెందిన దొడ్ల శివ, ప్రశాంత్, వెల్దండకు చెందిన గుడ్ల నరేశ్, రామకృష్ణ, సుభాష్, వెంకటేశ్‌లు హత్యాయత్నం చేశారు. సంఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు సీఐ నాగార్జున తెలిపారు. నిందితులను అరెస్టు చేసి శుక్రవారం కోర్టులో హాజరుపరిచి, న్యాయాధికారి ఆదేశం మేరకు రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు. పరారీలో ఉన్న వెంకటేశ్ కోసం గాలిస్తున్నట్లు తెలిపారు.

ఆరాధ్య దైవం అంబాభవాని

» గట్టులో ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి

» నేడు పందిరి పూజతో జాతర ప్రారంభం

» 8న రాత్రి ప్రభోత్సవం, 9న రథోత్సవం



జాతరకు ముస్తాబైన అమ్మవారు కొలువైన ఆలయం

గట్టు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లా, గట్టు ప్రజల ఆరాధ్య దైవం మాతా అంబాభవానీ జాతర శనివారం నుంచి ప్రారంభం కానున్నది. ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఎస్ఎస్‌కే సమాజ్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తి చేశారు. పందిరి పూజతో ఉత్సవాలను ప్రారంభించనున్నారు. వారం రోజుల పాటు ఘనంగా జరిగే ఉత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి 9 గంటలకు ప్రభోత్సవం నిర్వహించనున్నారు. అందుకోసం ప్రభను అలంకరించి సిద్ధం చేశారు. మరుసటి రోజు ఆదివారం కలశపూజ, బిందెసేవ కార్యక్రమాలుంటాయి. అనంతరం రాత్రి రథోత్సవాన్ని వైభవంగా నిర్వహించనున్నారు. 10వ తేదీన అమ్మవారికి పల్లకిసేవ, గ్రామంలో ఊరేగింపు ఉంటాయి. 11న అమ్మవారికి అభిషేకంతో ఉత్సవాలు ముగియనున్నాయి. ఉత్సవాలకు చుట్టుపక్కల గ్రామాల నుంచే కాకుండా పొరుగు రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర ప్రాంతాల నుంచి అధికసంఖ్యలో భక్తులు తరలిరానున్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

» విద్యార్థి సంఘాల నాయకుల డిమాండ్

» కల్వకుర్తి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ముట్టడి



ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని ముట్టడించిన విద్యార్థులు, ఎస్ఎఫ్ఐ, పీడీఎస్‌యూ, ఏఐఎస్ఎఫ్ నాయకులు

కల్వకుర్తి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. నాగర్‌కర్నూల్ జిల్లా, కల్వకుర్తి పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో ఎస్ఎఫ్ఐ, పీడీఎస్‌యూ, ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో విద్యార్థులు ధర్నా నిర్వహించారు. అనంతరం ర్యాలీగా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి చేరుకొని ముట్టడించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు సయ్యద్, పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంతోష్, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ప్రేమ్‌కుమార్ మాట్లాడారు. వ్యాప్తంగా ప్రైవేట్ డిగ్రీ, ఇంజనీరింగ్, పీజీ కాలేజీలు సమ్మె చేస్తున్నా, ప్రభుత్వం స్పందించకపోవడం సమంజసం కాదన్నారు. ఇప్పటికైనా స్పందించి పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల చదువులకు ఆటంకం కలుగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ఆందోళనలో విద్యార్థి సంఘాల నాయకులు వినోద్, కార్తీక్, అనిల్, అంజి, మల్లేశ్, రామ్, సాయి తదితరులు పాల్గొన్నారు.

పెళ్లి వేడుకలో వెల్లివిరిసిన దేశభక్తి



వందేమాతరం గీతాన్ని ఆలపిస్తున్న వధూవరులు

కొత్తకోట, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : పెళ్లి వేడుకలో దేశభక్తి వెల్లివిరిసిన సంఘటన వనపర్తి జిల్లా కొత్తకోట మండలంలో శుక్రవారం చోటుచేసుకున్నది. 'వందేమాతరం' జాతీయ గీతాన్ని మహాకవి బంకిమ్ చంద్ర చటర్జీ రచించి 150 సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భాన్ని పురస్కరించుకొని ప్రభుత్వ ఆదేశాల మేరకు శుక్రవారం అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో వందేమాతరం గీతాన్ని సామూహికంగా ఆలపించారు. ఆ స్ఫూర్తితో అమడబాకుల గ్రామానికి చెందిన సురేష్, మౌనిక వివాహం సందర్భంగా మాంగళ్యధారణ అనంతరం అక్కడ ఉన్న యువకులు వందేమాతరం గీతాన్ని ఆలాపన చేద్దామని చెప్పారు. దీంతో అందరూ ఒక్కసారిగా లేచి నిలబడి సామూహికంగా గేయాన్ని ఆలపించారు.

తొలగుతున్న అడ్డంకులు

(5వ పేజీ తరువాయి)

నదులు, తాజాగా రెండు భారత్‌మాల రహదారుల పనులు జరుగుతుండటం, నిత్యం ట్రామా కేసులు అధికంగా వస్తుండటంతో కొంత వైద్య సేవలకు హైదరాబాద్‌పైనే ఆధారపడాల్సిన పరిస్థితి ఉంది. అన్ని జిల్లాల్లో మెడికల్ కాలేజీలు ఏర్పాటు చేసి.. ఆసుపత్రులను జీజీహెచ్‌లుగా అప్‌గ్రేడ్ చేసినప్పటికీ అక్కడి నుంచి ఎక్కువగా రెఫరల్స్ మహబూబ్‌నగర్ ఆసుపత్రికే వస్తున్నాయి. అక్కడ వసతులు లేకపోవడం ఒక కారణమైతే.. రిస్క్‌ను భరించలేకపోవడం మరోకారణంగా చెప్పవచ్చు. అన్ని వసతులతో ఏర్పాటు కాబోతున్న మహబూబ్‌నగర్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి అందుబాటులోకి వస్తే ఉమ్మడి పాలమూరు జిల్లా ప్రజలకు అత్యంత ఉపకరంగా ఉంటుందని చెప్పవచ్చు.

విభాగాలు ఇలా..

ఆస్పత్రిని ఐదు బ్లాకులు, ఆరు అంతస్థులుగా నిర్మిస్తున్నారు. గ్రౌండ్‌ఫ్లోర్‌లో అన్ని విభాగాలకు సంబంధించిన ఓపీడి గదులు, వెయిటింగ్‌హాల్, ఫార్మసీ, రిజిస్ట్రేషన్, స్టోర్స్, రక్తనమూనాల సేకరణ, రేడియాలజీ, సీటీ స్కాన్, ఎంఆర్ఐ స్కాన్, ఎక్స్‌రే విభాగాలు ఉండనున్నాయి. మొదటి అంతస్తులో సూపర్ స్పెషాలిటీకి సంబంధించిన ఓపీడీ విభాగాలు, మెడికల్ ఎమర్జెన్సీ, ఐసీయూ, ట్రయాజ్ వార్డులు, ట్రామా సెంటర్‌లు, బ్లడ్ బ్యాంకు, సెంట్రల్ ల్యాబు, క్యాత్‌ల్యాబ్, క్యాత్ వార్డు, ఐసీయూ ఏర్పాటు చేయనున్నారు. రెండో అంతస్తులో జనరల్ మెడిసిన్ వార్డులు, డిపార్ట్‌మెంట్ గదులు, బర్న్స్ వార్డు, టీబీ, సీడీ వార్డులు, సైకియాట్రి, చర్మవ్యాధుల వార్డులు ఉండనున్నాయి. మూడో అంతస్తులో జనరల్ సర్జరీ, ఆర్థోపెడిక్, ఆప్తాల్మిక్ వార్డులు, డిపార్ట్‌మెంట్ గదులు ఉండేలా చూస్తున్నారు. నాల్గో అంతస్తులో ఆపరేషన్ థియేటర్లు, పోస్టుఆపరేటిక్, అనెస్టిషియా రికవరీ వార్డులు, సీఎస్ఎస్‌డీ, ఎస్ఐసీయూ, ఐసీసీయూ ఉండనున్నాయి. అదేవిధంగా ఐదో అంతస్తులో హాస్పిటల్ స్టోర్స్, అడ్మినిస్ట్రేషన్, సెమినార్ హాల్, ఎంఆర్‌డి, లెక్చర్ గ్యాలరీ, అకాడమిక్ బ్లాకును ఏర్పాటు చేస్తున్నారు.

క్రైం కార్నర్

చేపల వేటకు వెళ్లి వ్యక్తి మృతి

వనపర్తి రూరల్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): చేపల వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు చెరువులో పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన వనపర్తి మండల పరిధిలోని కడుకుంట్ల గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాలు మేరకు.. అదే గ్రామానికి చెందిన గజ్జల నరసింహ (55) గ్రామ శివారులోనే పెద్ద చెరువుకు చేపల వేటకు వెళ్లాడు. ప్రమాదవశాత్తు కాలుజారి చెరువులో పడి మృతి చెందాడు. అటువైపు వెళ్లిన కొందరు మృతదేహాన్ని చూసి గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. కుటుంబీకులు అక్కడికి చేరుకొని కన్నీరుమున్నీరయ్యారు.

నాగసాల చెరువులో మృతదేహం లభ్యం

జడ్చర్ల, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : చేపల వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు చెరువులో పడి జడ్చర్ల మండలం కిష్టంపల్లి గ్రామానికి చెందిన కావలి గణపతి(45) మృతి చెందాడు. స్థానికులు, గ్రామస్థులు తెలిపిన వివరాల మేరకు.. మహబూబ్‌నగర్ జిల్లా బాదేపల్లి మార్కెట్‌లో హమాలీగా పనిచేస్తున్న కావలి గణపతి గత మూడు రోజుల క్రితం చేపల వేటకని నాగసాల సమీపంలోని చెరువుకు వెళ్లాడు. ప్రమాదవశాత్తు చెరువులో పడి ఉంటాడని అనుమానం వ్యక్తం చేశారు. శుక్రవారం సాయంత్రం చెరువులో మృతదేహం కనిపించడంతో జడ్చర్ల పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి జడ్చర్ల అగ్నిమాపక కేంద్రం స్టేషన్ ఫైర్ ఆఫీసర్ రాజేందర్, లీడింగ్ ఫైర్‌మెన్ లక్ష్మీకాంత్‌రెడ్డి, సిబ్బంది సురేశ్, నవీన్‌కుమార్, ప్రేమ్‌కుమార్‌లు చేరుకుని మృతదేహాన్ని బయటికి తీశారు. పోస్టుమార్టం కోసం జడ్చర్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కాగా ఈ సంఘటనపై తమకు ఫిర్యాదు అందలేదని జడ్చర్ల పోలీసులు తెలిపారు.

కారుపై ఒరిగిపడిన లారీ

» ఒకరి దుర్మరణం, మరో ముగ్గురికి గాయాలు

కొత్తకోట/మూసాపేట, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : జాతీయ రహదారిలో కారుపై లారీ ఒరిగిపడిన ఘటనలో వేముల గ్రామ పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్న సతీష్‌రెడ్డి(48) అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. మరో ముగ్గురికి తీవ్రగాయాలు అయ్యాయి. ఈ సంఘటన శుక్రవారం వనపర్తి జిల్లా కొత్తకోట మండలంలో జరిగింది. వివరాల్లోకి వెళితే.. గద్వాలలో జరిగిన మిత్రుడు అఖిల్ (తుంకినిపూర్, మూసాపేట్ మండలం) వివాహానికి హాజరై తిరిగి కారులో మహబూబ్‌నగర్‌కు వెళ్తున్నారు. అదే దారిలో హైదరాబాద్ వైపు వెళ్తున్న పత్తి లారీ ఒరిగి కారుపై పడింది. కారులో ఉన్న సతీష్‌రెడ్డి (హస్నాపూర్, భూత్పూర్ మండలం) మృతి చెందగా, మహేందర్ (అడ్డాకుల), కార్తీక్ (హౌసింగ్ బోర్డు కాలనీ, పాలమూరు), నగేందర్ (శాఖాపూర్, అడ్డాకుల), గాయపడ్డారు. వారిని చికిత్స నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించారు. వీరంతా పంచాయతీ కార్యదర్శులు. రహదారిలో కారుపై లారీ బోల్తా పడడంతో వాహనాలు పెద్ద ఎత్తున నిలిచాయి. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఆనంద్ తెలిపారు. మృతుడికి భార్య, ఒక కుమారుడు, కూతురు ఉన్నారు.

హైదరాబాద్‌లో విద్యార్థి ఆత్మహత్య

వడ్డేపల్లి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : మునిసిపాలిటీ కేంద్రమైన శాంతినగర్‌కు చెందిన పరశురాం(20) హైదరాబాద్‌లోని తెలుగు విశ్వవిద్యాలయం వసతి గృహంలో గురువారం ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. డిగ్రీలో బ్యాచిలర్ ఆఫ్ డిజైనర్ తృతీయ సంవత్సరం చదువుతున్నట్లు తెలిపారు. పరశురాం మృతిపై కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేశారు. ఈ మేరకు బాచుపల్లి పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం మృతుడి తల్లి పద్మ ఫిర్యాదు చేశారు. దీనిపై పోలీసులు పూర్తి స్థాయిలో విచారణ చేయాలని కోరారు. కాగా, విద్యార్థి తండ్రి గత రెండు సంవత్సరాల క్రితం ఆత్మహత్య చేసుకున్నాడు.

గొర్రె పిల్లలపై కుక్కల దాడి

» దాడిలో 15 గొర్రెపిల్లల మృతి - రూ.70 వేల నష్టం



మృతి చెందిన గొర్రె పిల్లలను చూపిస్తున్న గొర్రెల కాపరి

ఊట్కూర్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): వీధి కుక్కల దాడిలో 15 గొర్రె పిల్లల మృతి చెందిన సంఘటన ఊట్కూర్ మండల కేంద్రంలో శుక్రవా రం చోటు చేసుకుంది. గొర్రెల కాపరులు, గ్రామస్థుల కథనం ప్రకారం... మండల కేంద్రానికి చెందిన మహేష్ తన గొర్రెలను గ్రామ శివారులోని పాకలో చిన్న గొర్రె పిల్లలను ఉంచి, బీడు పొలాల్లో పెద్దవాటిని మేపడానికి వెళ్లాడు. దీంతో అటువైపు వచ్చిన వీధికుక్కలు కంచెలో చొరబడి గొర్రె పిల్లలపై దాడి చేసి విధ్వంసం సృష్టించాయి. అటు నుంచి పోయే వారు కుక్కలను త రిమివేశారు. అనంతరం గొర్రెలకాపరులకు సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి చూడగా అప్పటికే 15 గొర్రె పిల్లలు మృతి చెందాయి. గొర్రె పిల్లల మృతితో బాధితుడికి రూ.70 వేల వరకు నష్టం జరిగింది.

డ్రంకెన్ డ్రైవ్ కేసుల్లో నలుగురికి జైలు శిక్ష

కల్వకుర్తి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): డ్రంకెన్ డ్రైవ్‌లో నలుగురికి న్యాయాధికారి జైలు శిక్ష, జరిమానా విధించినట్లు కల్వకుర్తి ఎస్ఐ జి.మాధవరెడ్డి తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాలు ఎస్ఐ కథనం ప్రకారం... కల్వకుర్తి పట్టణంలోని గాంధీనగర్ కాలనీకి చెందిన కొంగరి గౌతమ్, కల్వకుర్తి మండల పరిధిలోని మార్చాలకు చెందిన రాములు, ఎల్లికల్ గ్రామానికి చెందిన నాగనూల్ శివకుమార్, దాదమోని వెంకటయ్యలు డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడ్డారు. వీరిని శుక్రవారం కోర్టులో హాజరు పరిచారు. విచారించిన న్యాయాధికారి జడ కావ్య కొంగరి గౌతమ్‌కు 3రోజుల జైలు శిక్ష, రూ.500ల జరిమానా, టి.రాములుకు మూడు రోజుల జైలు శిక్ష, రూ.500 జరిమానా, నాగనూల్ శివకుమార్, దాదమోని వెంకటయ్యలకు ఒక రోజు చొప్పున జైలుశిక్ష, రూ.600లు చొప్పున జరిమానా విధించినట్లు ఎస్ఐ తెలిపారు.

ముగ్గురికి జరిమానా

తాడూరు, (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా తాడూరు మండలంలో గత రెండు మూడు రోజులుగా డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన ముగ్గురు వ్యక్తులకు కోర్టు జరిమానా విధించినట్లు ఎస్ఐ గురుస్వామి తెలిపారు. వంగూరు గ్రామానికి చెందిన దీపక్ అనే వ్యక్తికి వెయ్యి రూపాయల ఫైన్ కాగా, తండ్రా గ్రామానికి చెందిన ఎల్లకంటి సత్యంకు రూ.వెయ్యి, తాడూరు గ్రామానికి చెందిన తీగల శ్రీనివాస్‌కు రూ.వెయ్యి ఫైన్ విధించడంతో పాటు మరొకమారు మద్యంతాగి వాహనాలు నడిపినట్లయితే కఠిన శిక్షలు అమలు చేయనున్నట్లు మేజిస్ట్రేట్ శృతిదూత హెచ్చరించారు.

యువరైతు బలవన్మరణం

కృష్ణ, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ఓ యువరైతు ఉరివేసుకొని బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ సంఘటన నారాయణపేట జిల్లా, కృష్ణ మండల పరిధిలోని గుడెబల్లూరులో శుక్రవారం తెల్లవారుజామున జరిగింది. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన మఖ్యల మహేశ్ (23) వ్యవసాయం చేస్తూ జీవనం గుడుపుతున్నాడు. గురువారం రాత్రి భోజనం చేసి, పొలానికి వెళ్లిన మహేశ్ శుక్రవారం ఉదయం ఇంటికి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు పొలానికి వెళ్లి చూడగా, అక్కడి రేకుల షెడ్డులో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకొని కనిపించాడు. దీంతో వారు పోలీసులకు సమాచారం అందించగా, ఎస్ఐ నవీద్ సిబ్బందితో కలిసి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని మక్తల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సంఘటనపై తల్లి ముఖ్యలి తాయమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఆత్మహత్యకు కారణాలు తెలియాల్సి ఉన్నది.

పాము కాటుతో...

నర్వ, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : నారాయణపేట జిల్లా నర్వ మండల కేంద్రానికి చెందిన రైతు దాసు (48) పాముకాటుకు గురయ్యాడు. శుక్రవారం కౌలుకు వేసుకున్న పొలంలో పత్తి తీయడానికి కూలీలు రావడంతో తాగడానికి నీళ్ల తీసుకురావడానికి దగ్గరలో ఉన్న బోర్ దగ్గరకు వెళ్లగా కాలిపై పాము కాటు వేసింది. చికిత్స కోసం 108 అంబులెన్స్ ద్వారా మహబూబ్ నగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా మార్గమధ్యంలో మృతి చెందాడు. మృతునికి భార్య, ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె ఉండగా కుటుంబీకుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రమేష్ తెలిపారు.

యువతి అదృశ్యం

జడ్చర్ల, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): జడ్చర్ల మండలం గంగాపురం గ్రామానికి చెందిన సంజిగారి మహేశ్వరీ కనిపించడం లేదంటూ శుక్రవారం తండ్రి ఊషన్న జడ్చర్ల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. జడ్చర్ల సీఐ కమలాకర్ తెలిపిన వివరాల మేరకు... ఈ నెల 6న ఉదయం 6గంటలకు ఇంట్లో నుంచి బయటికి వెళ్లిన మహేశ్వరీ, తిరిగి ఇంటికి రాలేదు. ఆచూకీ కోసం వెతికినా ఫలితం లేకపోవడంతో ఫిర్యాదు చేశాడని తెలిపారు.

తగ్గని వరద ఉధృతి

» లోలెవల్ వంతెనపై భారీగా నీరు
» జూపల్లి - వంగూరు మధ్య నిలిచిపోయిన రాకపోకలు



లోలెవల్ వంతెనపై ఉధృతంగా ప్రవహిస్తున్న నీరు

వంగూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలకు రెండు ప్రధాన రహదారులను కలిపే జూపల్లి-వంగూరు రోడ్డు పొంగిపొర్లే వాగులతో ప్రజలు సతమతమవుతున్నారు. జూపల్లి నుంచి వంగూరు గేటు వెళ్లే ఈ రోడ్డులో ఉన్న లోలెవల్ వంతెనపై ఇంకా ఎగువ నుంచి వచ్చే నీరు తగ్గక ఉధృతంగా ప్రవహిస్తుంది. దీంతో వంతెన లేక రహదారిపై పారే వరదతో రాకపోకలు నిలిచిపోయి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఏళ్లగా ఈ సమస్యతో ఇబ్బంది పడుతున్నా పట్టించుకునే వారే కరువయ్యారని ప్రజలు ఆరోపిస్తున్నారు.

శంకుస్థాపనకే పరిమితమైన బీటీ రోడ్డు పనులు

వంగూరు గేటు నుంచి జూపల్లి వరకు బీటీ రోడ్డుకు గాను రూ.9 కోట్లు మంజూరయ్యాయి. 8 నెలల కిందట రోడ్డు పనులకు ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణ రెడ్డి శంకుస్థాపన చేశారు. నేటికీ రోడ్డు పనులు జరుగక శంకుస్థాపనకే పరిమితమైంది. ప్రస్తుతం వర్షాలకు పూర్తిగా దెబ్బతిని రోడ్డుపై అడుగడుగునా మోకాళ్లలోతు గుంతలు ఏర్పడి నీరు నిలిచి ప్రమాదభరితంగా మారింది. వంతెన లేక వర్షాలకు వరద నీరు లోలెవల్ వంతెనపై ఉధృతంగా ప్రవహిస్తోంది. ఈ రహదారి గుండా వంగూరు, జూపల్లి, తుమ్మలపల్లి గ్రామాల రైతులు, ప్రజలు నిత్యం తమ పనుల కోసం వెళ్లాల్సిన అవసరం ఉంది. కురిసిన భారీ వర్షాలకు లో లెవల్ వంతెనపై వరద నీరు ఉధృతంగా ప్ర వహిస్తుండటంతో రాకపోకలు నిలిచిపోయి ఆయా గ్రామాల ప్రజలకు తీవ్ర అంతరా యం కలుగుతుంది. ఇకనైనా అధికారులు వెంటనే బీటీ రోడ్డు పనులను ప్రా రంభించి, హైలెవల్ వంతెన ఏర్పాటు చేయాలని ప్రజ లు కోరుతున్నారు.

రసవత్తరంగా క్రీడా పోటీలు

» కొనసాగుతున్న జోనల్ లెవల్ గేమ్స్ అండ్ స్పోర్ట్స్ మీట్



జడ్చర్ల మండలం చిట్టెబోయిన్‌పల్లిలో జోనల్ లెవల్ గేమ్స్ అండ్ స్పోర్ట్స్ మీట్‌లో చెస్ ఆడుతున్న క్రీడాకారులు

జడ్చర్ల, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : జడ్చర్ల మండలంలోని చిట్టబోయిన్‌పల్లి సాంఘిక, సంక్షేమ బాలికల పాఠశాలలో తెలంగాణ సోషల్‌వెల్ఫేర్ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూట్ సొసైటీ 11వ జోనల్ లెవల్ గేమ్స్ అండ్ స్పోర్ట్స్ మీట్ పోటీలు శుక్రవారం రెండవ రోజు కొనసాగాయి. మహబూబ్‌నగర్, జోగుళాంబ గద్వాల, నారాయణపేట జిల్లాల్లోని సాంఘిక, సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలల విద్యార్థులు అండర్-14, అండర్-17 విభాగాలలో పాల్గొన్నారు.

అథ్లెటిక్స్, కబడ్డీ, వాలీబాల్, హ్యాండ్‌బాల్, ఖోఖోతో పాటు ఇండోర్ గేమ్స్ చెస్, క్యారమ్స్ ను నిర్వహించారు. అండర్-14 విభాగంలో ఖోఖోలో ఉట్కూర్, మానపాడు పాఠశాలల జట్లు ఫైనల్స్‌కు చేరాయి. అలాగే టెన్నికాయిట్‌లో నంచెర్ల, మక్తల్ జట్లు, చెస్‌లో మరికల్, మక్తల్ జట్లు, క్యారమ్స్‌లో గట్టు, మానవపాడు జట్లు ఫైనల్స్‌కు చేరాయి. అలాగే అండర్-17 విభాగంలో ఖోఖోలో నంచెర్ల, మరికల్ జట్లు, కబడ్డీలో రంగారెడ్డిగూడెం, ఉట్కూర్ జట్లు, వాలీబాల్ పోటీలలో నంచెర్ల, మానవపాడు, టెన్నికాయి ట్‌లో ఉట్కూర్, నంచెర్ల జట్లు, చెస్‌లో మక్తల్, మానవపాడు జట్లు, క్యారమ్స్‌లో నారాయణపేట, ఉట్కూరు జట్లు ఫైనల్స్‌కు చేరాయి. శనివారం ఫైనల్స్ జరుగనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ప్రిన్సిపాల్ అనిత, ఉపాధ్యాయులు రాజేశ్వరీ, భవానీ, శ్రీదేవితో పాటు పీఈటీలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

..ఆ 14 రోజులు

» బాలింతకు ప్రాణం పోశారు..
» మహబూబ్‌నగర్ జనరల్ ఆసుపత్రి వైద్యుల పనితీరుకు అభినందనలు



ప్రాణాలతో బయటపడ్డ రోగితో సూపరింటెండెంట్, గైనిక్ డాక్టర్ల బృందం

మహబూబ్‌నగర్(వైద్యవిభాగం) నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ప్రాణాపాయస్థితిలో ఆసుపత్రికి వచ్చిన ఓ రోగికి 14 రోజులు కష్టపడి ప్రాణాలు కాపాడారు. ఈ సంఘటన మహబూబ్‌నగర్ జిల్లా జనరల్ ఆసుపత్రిలో జరిగింది. వివరాల్లోకి వెళితే... చిన్నచింతకుంట మండలం నెల్లికొండి గ్రామానికి చెందిన భాగ్యశ్రీ పురిటినొప్పులతో దేవరకద్రలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి వెళ్లింది. ఆమె కాన్పు కావడంతో పాటు 2.7 కిలోల బరువు ఉన్న బాబుకు జన్మనిచ్చింది. కాన్పు జరిగిన తర్వాత తీవ్ర రక్త స్రావం కావడంతో ఆమెను వెంటనే జనరల్ ఆసుపత్రికి తరలించారు. అయితే ఆమె శరీరంలో రక్తం 5 గ్రాములకు వచ్చింది. వెంటనే ఈ కేసును గైనిక్, మత్తు విభాగం డాక్టర్లు తీసుకొని 14 రోజుల పాటు వైద్య సేవలు అందించారు. అంతేకాకుండా 14 యూనిట్ల రక్తాన్ని కూడా ఎక్కించారు. ప్రస్తుతం ఆమె కోలుకుంది. తల్లీబిడ్డ ఆరోగ్యంగా ఉన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రంగా అజ్మీర గైనిక్, మత్తు విభాగం డాక్టర్లను అభినందించారు. అనంతరం రోగి భర్త శ్రీహరి మాట్లాడుతూ ఈరోజు నా భార్య, బిడ్డ బతికిందంటే అది జనరల్ ఆసుపత్రి డాక్టర్ల చలవేనని, వారికి జీవితాంతం రుణపడి ఉంటానని కృతజ్ఞతలు తెలిపారు. ఆసుపత్రి మత్తు విభాగాధిపతి డాక్టర్ మాధవి, గైనిక్ హెచ్‌వోడీ డాక్టర్ ప్రసన్నలక్ష్మి, అసోసియేట్ ప్రొఫెసర్లు డాక్టర్ లక్ష్మీపద్మప్రియ, వైద్యులు ఆశాజ్యోతి, అర్చన, సోఫియా, వెన్నెల, శ్వేత, నర్సింగ్ ఆఫీసర్ మాధవి, సరస్వతి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర జట్టు విజేతగా నిలవాలి

» జిల్లా వాలీబాల్ సంఘం ఆర్గనైజింగ్ సెక్రటరీ చెన్నవీరయ్య



రాష్ట్ర బాలికల వాలీబాల్ జట్టుతో అధికారులు

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి వాలీబాల్ టోర్నీలో రాష్ట్ర బాలికల జట్టు విజేతగా నిలవాలని జిల్లా వాలీబాల్ సంఘం ఆర్గనైజింగ్ సెక్రటరీ చెన్నవీరయ్య అన్నారు. ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో బరేలీలో ఈ నెల 11 నుంచి 15వ తేదీ వరకు నిర్వహించనున్న జాతీయస్థాయి ఎస్‌జీఎఫ్ అండర్-17 బాలికల వాలీబాల్ టోర్నీలో పాల్గొనే రాష్ట్ర బాలికల జట్టు తరలివెళ్లింది. శుక్రవారం స్టేడియం మైదానంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జట్టును అభినందించారు.

ఈ సందర్భంగా చెన్నవీరయ్య మాట్లాడుతూ బాలికలు క్రీడల్లో ప్రతి క్రీడా అంశాల్లో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తున్నారని అన్నారు. రాష్ట్ర పీడీ, పీఈటీఎస్ అసోసియేషన్ అధ్యక్షుడు దూమర్ల నిరంజన్, పేట టీఎస్ జిల్లా అధ్యక్షుడు జగన్‌మోహన్‌గౌడ్, వ్యాయామ ఉపాధ్యాయులు వేణుగోపాల్, వడెన్న, రమేష్ బాబు, రాజవర్ధన్‌రెడ్డి, రాములు, వెంకటమ్మ, పర్వేజ్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర వాలీబాల్ బాలికల జట్టు: టి.వైష్ణవి, కె.మైత్రి, జి.గీత, డి.అక్షిత (మహబూబ్‌నగర్) కె.సింధు (నల్గొండ), నిహర్షిత, మసిరిక్ష (ఖమ్మం), సిగ్నత(కరీంనగర్), ప్రశాంతి, నందినిశ్రీ, అక్షరశ్రీ (నిజామాబాద్), నక్షత (రంగారెడ్డి), స్టాండ్ బైగా శ్రీవర్షిణి (ఆదిలాబాద్), శైని(రంగారెడ్డి), ఐశ్వర్య(వరంగల్).

గంజాయి ముఠా అరెస్టు



సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీనివాసులు

తెలకపల్లి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): గంజాయి ముఠాను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ శ్రీనివాసులు తెలిపారు. శుక్రవారం రాత్రి పోలీస్ స్టేషన్‌లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శుక్రవారం మధ్యాహ్నం తెలకపల్లి గ్రామ సమీపంలోని విజయుడు వెంచర్ పక్కన అనుమానాదస్పదంగా ఉన్న ఐదుగురు యువకులను పక్కా సమాచారంతో పోలీసులు పట్టుకొని విచారించారు. తెలిపారు.

వారి దగ్గర నుంచి 138 గ్రాముల గంజాయి, మూడు సెల్ ఫోన్లు, ఒక స్కూటీని స్వాధీనం చేసుకుని సీజ్ చేసినట్లు తెలిపారు. నాగర్ కర్నూల్‌కు చెందిన రేణు కుమార్, నాగర్ కర్నూల్‌కు చెందిన గణేష్, తెలకపల్లికి చెందిన అఖిల్, వట్టిపల్లికి చెందిన నారాయణ, చరణ్ మరో బాలుడు గంజాయి సేవిస్తూ పట్టుబడినట్లు డీఎస్పీ తెలిపారు. వారిని నాగర్ కర్నూల్ కోర్టులో హాజరు పరిచి వారిని రిమాండ్‌కు తరలిస్తున్నట్లు తెలిపారు. విలేకరులు సమావేశంలో డీఎస్పీ శ్రీనివాసులు, సీఐ అశోక్ రెడ్డి, ఎస్ఐ నరేష్ పాల్గొన్నారు.

ఇసుక టిప్పరు పట్టివేత

రాజాపూర్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): రాజాపూర్ మండలంలోని చెన్న వెళ్లి గ్రామంలోని స్థానిక దుందుభీ వాగు నుంచి అక్రమంగా ఇసుకను తర లిస్తున్న టిప్పరును శుక్రవారం పట్టుకున్నట్లు ఎస్ఐ శివానందం తెలిపారు. బ్లూ కోర్టు డ్యూటీలో విధులు నిర్వహిస్తున్న తమ పోలీసు సిబ్బంది పట్టుకు ని టిప్పరును పోలీసు స్టేషన్‌కు తరలించిన్నట్లు తెలిపారు. పట్టుబడిన టి ప్పరు యజమానిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ, పోలీసులు తెలిపారు.

అనుమానాస్పదంగా వ్యక్తి మృతి

- రైలు పట్టాల పక్కన మృతదేహం



రంగప్ప(ఫైల్)

కృష్ణ, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : నారాయణపేట జిల్లా, కృష్ణ మండల వాసి కర్ణాటక రాష్ట్రంలో అనుమానాస్పదంగా మృతి చెందాడు. గురువారం రాత్రి ఈ సంఘటన జరిగింది. మండల పరిధిలోని హిందూపూర్ గ్రామానికి చెందిన సకాలి రంగప్ప (29) భార్య రాజేశ్వరి, ఇద్దరు కొడుకులతో కలిసి 4 నెలలుగా కర్ణాటక రాష్ట్రం, యాదగిరి జిల్లాలోని అత్తగారి ఊరు సైదాపూర్‌లో ఉంటున్నాడు. ఎప్పటిలాగే గురువారం ఉదయం సెంట్రింగ్ పనులకు వెళ్లి ఇంటికి తిరిగి రాలేదు. శుక్రవారం ఉదయం అతడి మృతదేహం సైదాపూర్‌లోని రైలు పట్టాల పక్కన పడి ఉన్నట్లు కుటుంబ సభ్యులకు సమాచారం అందడంతో వారు అక్కడికి చేరుకున్నారు. తన భర్త మృతిపై అనుమానాలు ఉన్నట్లు భార్య రాజేశ్వరి రైల్వే పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

ప్రమాదానికి గురై..

చికిత్స పొందుతూ..

రేవల్లి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ఏదుల మండలంలోని అనంతపురం గ్రామానికి చెందిన రాములు (50) ప్రమాదానికి గురై చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. పోలీసులు తెలిపిన సమాచారం మేరకు... రాములు గత సోమవారం తన మూడవ కూతురైన శిరీషతో కలిసి వనపర్తికి వెళ్లి తిరిగి వస్తున్నాడు.

చెన్నారం గ్రామ సమీపంలో రోడ్డుపై మూల మలుపు దగ్గర అప్పాయిపల్లి గ్రామానికి చెందిన ఓటెల్లా ఆంజనేయులు తన ఆటోలో ఏదుల నుంచి పాల క్యాన్లు వేసుకొని అజాగ్రత్తగా ఆటోను నడుపుతూ రాములు వస్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టాడు.

రాములు తలకు బలంగా గాయం కావడంతో తన కూతురు శిరీషకు కాలు విరిగింది. వెంటనే వారిని చికిత్స నిమిత్తం హైదరాబాద్ నిమ్స్ ఆసుపత్రికి తరలించారు. శుక్రవారం ఉదయం దాదాపు 9 గంటల సమయంలో రాములు మృతి చెందాడు. భార్య తిరుపతమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ చంద్రశేఖర్ తెలిపారు. రాములు తిరుపతమ్మ దంపతులకు నలుగురు కూతుర్లు ఒక కుమారుడు ఉన్నారు.

అథ్లెటిక్స్‌లో పతకాలు సాధించాలి

» ఎస్‌జీఎఫ్ సెక్రటరీ శారదాబాయి
» ఉత్సాహంగా జిల్లా అండర్-17 అథ్లెటిక్స్ జట్ల ఎంపికలు



అథ్లెటిక్స్ ఎంపికలను జెండా ఊపి ప్రారంభిస్తున్న ఎస్‌జీఎఫ్ సెక్రటరీ శారదాబాయి

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు పతకాలు సాధించాలని ఎస్‌జీఎఫ్ సెక్రటరీ శారదాబాయి అన్నారు. జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం స్టేడియంలో జిల్లా అండర్-17 అథ్లెటిక్స్ బాల,బాలికల జట్ల ఎంపికలు నిర్వహించారు. ఎంపికలను శారదాబాయి హాజరై ప్రారంభించారు. ఎంపికలకు బాల,బాలికల విభాగంలో 600 మంది హాజరయ్యారు. వ్యాయమ ఉపాధ్యాయులు జగన్‌మోహన్‌గౌడ్, వేణుగోపాల్, ఆనంద్‌కుమార్, శైలజ, అరుణజ్యోతి, అంజనమ్మ తదితరులు పాల్గొన్నారు.

10,11న జిల్లా ఖోఖో జట్ల ఎంపికలు

స్కూల్ గేమ్స్ ఫేడరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 10,11 జిల్లా బాల,బాలికల ఖోఖో జట్ల ఎంపికలు నిర్వహిస్తున్నట్లు ఎస్‌జీఎఫ్ సెక్రటరీ శారదాబాయి ఒక ప్రకటనలో తెలిపారు. 10న అండర్-14, 11న అండర్-17 జట్ల ఎంపికలు ఉంటాయని పేర్కొన్నారు. స్కూల్ బోనఫైడ్, ఆధార్‌కార్డు జిరాక్స్‌తో ఉదయం 9గంటలకు స్టేడియంలో పీడీ మోగులాల్‌కు రిపోర్టు చేయాలని కోరారు.

11న జిల్లా యోగా జట్ల ఎంపికలు

స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 11న జిల్లా బాల,బాలికల అండర్-14, 17, 19 యోగా జట్ల ఎంపికలు నిర్వహిస్తున్నట్లు ఎస్‌జీఎఫ్ సెక్రటరీ శారదాబాయి ఒక ప్రకటనలో తెలిపారు. అండర్-14, 17 క్రీడాకారులు స్కూల్ బోనఫైడ్, ఆధార్‌కార్డు జిరాక్స్, అండర్-19 క్రీడాకారులు పదవ తరగతి ఒరిజనల్ మెమో, ఆధార్‌కార్డు జిరాక్స్‌తో ఉదయం 9 గంటలకు స్టేడియం మైదానంలో పీడీ జ్యోతికి రిపోర్టు చేయాలని కోరారు.

రాష్ట్రస్థాయి టోర్నీలో విజయం సాధించాలి

- జిల్లా ఆర్చరీ సంఘం ప్రధాన కార్యదర్శి రాంచందర్



ఆర్చరీ పోటీలకు ఎంపికైన జిల్లా క్రీడాకారులు

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి విలువిద్య పోటీల్లో జిల్లా క్రీడాకారులు పతకాలు సాధించి విజేతలుగా నిలవాలని జిల్లా ఆర్చరీ సం ఘం ప్రధాన కార్యదర్శి రాంచందర్ అన్నారు. ఈ నెల 9న హైదరాబాద్‌లో గల తెల్లపూర్‌లోని ఏకలవ్య స్పోర్ట్స్ హబ్‌లో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి స బ్‌జూనియర్ ఆర్చరీ చాంపియన్ షిప్‌లో టోర్నీకి ఎంపికైన జిల్లా క్రీడాకారు లను శుక్రవారం స్టేడియం మైదానంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రాంచందర్ అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ప్రతిభ గల క్రీడాకారులకు కొదవలేదని, ఎంతో మంది క్రీడాకారులు విలువిద్యలో రాష్ట్ర, జాతీయస్థాయిలో రాణిస్తున్నారని అన్నారు. టోర్నీలో ప్రతిభ చాటి జాతీయస్థాయి పోటీలకు ఎంపిక కావాలని ఆకాంక్షించారు. కోచ్ జ్ఞానేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన జిల్లా క్రీడాకారులు..

బాలుర విభాగంలో: దేవిరామ్, శివకుమార్, లక్ష్మీకాంత్, సాయితేజ, హర్షవర్ధన్, బానుప్రసాద్, మణీశ్వర్, కృతిక్, చంద్రనీల్

బాలికల విభాగంలో: స్మిరితి సానిబ, అయేషసిద్ధిఖ, సాయిసమీక్ష, శారుణి, డి. సమీక్ష, శ్రీహిత, దీక్షిత, సాత్విక.

దొరికిన డబ్బు బాధితుడికి అందజేత

» నిజాయితీ చాటుకున్న మహిళలు

గద్వాల క్రైం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): గురువారం రోడ్డుపై దొరికిన డబ్బును మహిళలు ట్రాఫిక్ ఎస్ఐ బాలచంద్రుడుకు అందజేయగా, శుక్రవారం పోగొట్టుకున్న వ్యక్తికి అందజేశారు. ఇందుకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి. జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని దయానంద పాఠశాలలో పీఈటీగా విధులు నిర్వహిస్తున్న గంజిపేట కాలనీకి చెందిన తిమ్మన్న గురువారం ప్రభుత్వ బాలికల పాఠశాల ముందు నడుచుకుంటూ వెళ్తుండగా రోడ్డుపై రూ. 10వేలు పడిపోయాయి. ఆ డబ్బులను అదే సమయంలో ఆ దారిలో వెళ్తున్న దౌదర్‌పల్లికి చెందిన మహిళలు గమనించి ట్రాఫిక్ ఎస్ఐకు అప్పగించి వారి నిజాయితీని చాటుకున్నారు. అయితే డబ్బులు పోగొట్టుకున్న వ్యక్తి విషయాన్ని తెలుసుకొని శుక్రవారం ట్రాఫిక్ ఎస్ఐ బాలచంద్రుడిని కలిసి విషయాన్ని తెలిపారు.

ఆ డబ్బులు ఆయనవే అని నిర్ధారించుకొని తిమ్మన్నకు మహిళల సమక్షంలో డబ్బును అప్పగించాడు. తిమ్మన్న ట్రాఫిక్ ఎస్ఐతో పాటు మహిళలకు కృతజ్ఞతలు తెలిపారు. ట్రాఫిక్ సిబ్బంది యుగందర్ ఉన్నారు.



న్యూస్ బాక్స్

ఘనంగా గురుపూజ

హన్వాడ, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నాయినోనిపల్లి గురు మందిరంలో శుక్రవారం గురు భక్తులు పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎర్రన్న, సత్యన్న, అనంతరెడ్డి ఆధ్వర్యంలో భజనలు చేస్తూ స్వామిని పల్లకీలో ఊరేగించారు.

పుణ్య క్షేత్రాలకు ప్రత్యేక బస్సులు

మహబూబ్‌నగర్ టౌన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : కార్తీక మాసం పురస్కరించుకొని ప్రయాణికుల కోరిక మేరకు పుణ్య క్షేత్రాలకు ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు మహబూబ్‌నగర్ ఆర్టీసీ డిపో మేనేజర్ సుజాత శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వేములవాడ - ధర్మపురి, మంత్రాలయం - జోగులాంబ ఆలయం ఇతర పుణ్య క్షేత్రాలకు ప్రత్యేక డీలక్స్ బస్సులు నడుపుతున్నట్లు ఆమె తెలిపారు. ఈ బస్సులు 15న ఉదయం 6 గంటలకు మహబూబ్‌నగర్ నుంచి బయలు దేరుతాయని తెలిపారు.

మార్కెట్‌లో ధాన్యం విక్రయాలు

దేవరకద్ర, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : దేవరకద్ర మార్కెట్‌కు శుక్రవారం ధాన్యం క్రయ విక్రయాలు కొనసాగాయి. పెద్ద హంస 146 క్వింటాళ్లు విక్రయానికి రాగా, క్వింటాలుకు ధర గరిష్ఠంగా రూ.1769, కనిష్ఠంగా రూ.1,764 పలికినట్లు మార్కెట్ అధికారి జయశ్రీ తెలిపారు. ఆర్ఎన్ఆర్ 1491 క్వింటాళ్లు రాగా, క్వింటాలుకు గరిష్ఠంగా రూ.2,173, కనిష్ఠంగా రూ.2,017 పలికినట్లు మార్కెట్ అధికారి జయశ్రీ తెలిపారు.

ఘనంగా బిర్సా ముండా జయంతి

జడ్చర్ల, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని గిరిజన సంక్షేమ బాలుర వసతి గృహంలో శుక్రవారం బిర్సా ముండా జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి జనార్దన్ పూలమాల వేసి నివాళి అర్పించారు. హాస్టల్ వార్డెన్ రాజేందర్, ఉపాధ్యాయులు దామోదర్, లలిత, శ్రీనివాస్‌యాదవ్, రేణుక పాల్గొన్నారు.

ఎక్స్‌కవేటర్‌కు ఎమ్మెల్యే పూజలు

జడ్చర్ల, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : జడ్చర్ల మునిసిపాలిటీ ఆధ్వర్యంలో కొనుగోలు చేసిన ఎక్స్‌కవేటర్‌కు శుక్రవారం మునిసిపల్ కార్యాలయ ఆవరణలో ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి పూజలు నిర్వహించారు. మునిసిపల్ చైర్‌పర్సన్ పుష్పలత, వైస్ చైర్‌పర్సన్ సారిక, కమిషనర్ లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.

నాస్తిక సమాజం సదస్సుకు తరలిరండి

పాలమూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : నాస్తిక సమాజం ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా కేంద్రంలోని టీఎన్‌జీవోస్ భవనంలో నిర్వహించే సదస్సుకు ప్రజలు, ప్రజాస్వామిక వాదులు తరలిరావాలని నాస్తిక సమాజం నాయకులు చింతకింది జనార్ధన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో చాలాకాలం నాస్తిక సమాజంలో పనిచేసిన దివంగత అయ్యన్న యాదిలో సైన్సుపై, మూఢనమ్మకాలపై ప్రత్యేక సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ముఖ్య అతిథి నసీర్, చెన్నయ్య, విజయకుమార్, ప్రజాసంఘాల నాయకుల ప్రసంగాలు ఉంటాయన్నారు.

సొంతింటి కల సాకారం

గండీడ్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ఇందిరమ్మ రాజ్యంలోనే అర్హత గల ప్రతీ ఒక్క పేదోడి సొంతింటి కల నెరవేరిందని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జితేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని చెన్నాయిపల్లితండాలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ప్రొసీడింగ్‌లను అందజేసి, భూమి పూజ చేశారు. పీఏసీఎస్ చైర్మన్ లక్ష్మీనారాయణ, పంచాయతీ కార్యదర్శి మంగమ్మ, రమేష్‌నాయక్, దోమ శ్రీనివాస్‌రెడ్డి, ఆంజనేయులు, దుర్గానాయక్, అంజి పాల్గొన్నారు.

వంద శాతం ఫలితాలే లక్ష్యంగా పని చేయాలి

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): పదో తరగతిలో వంద శాతం ఫలితాలే లక్ష్యంగా ఉపాధ్యాయులు దృష్టి పెట్టాలని డీఈవో ప్రవీణ్‌కుమార్ అన్నారు. శుక్రవారం ఆయన చాంబర్‌లో పదో తరగతి పరీక్షలకు సంబంధించి అన్ని సబ్జెక్టుల నిపుణులైన ఉపాధ్యాయులతో సమావేశమై సూచనలు చేశారు. పది పరీక్షలు మార్చిలో జరగనున్నందున డిసెంబరు చివరి నాటికి సిలబస్ పూర్తి చేసేలా హెచ్‌ఎంలు, సబ్జెక్టు ఉపాధ్యాయులు దృష్టి సారించాలన్నారు. ఏఎంవో దుకుందు శ్రీనివాస్, సీఎంవో సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

అప్పు తీర్చలేనన్న మనోవేదనతో వ్యక్తి ఆత్మహత్య

జడ్చర్ల, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : నూతనంగా కట్టుకున్న ఇల్లుతో పాటు పిల్లల చదువుల కోసం చేసిన అప్పులు తీర్చలేనన్న మనోవేదనతో వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన శుక్రవారం జడ్చర్లలో చోటు చేసుకుంది. జడ్చర్ల సీఐ కమలాకర్ కథనం ప్రకారం.. మిడ్జిల్ మండలం దోనూరుకు చెందిన నెలకంటి శ్రీను, కళావతి భార్యాభర్తలు. వీరికి ఒక బాబు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. కళావతి జడ్చర్ల తహసీల్దార్ కార్యాలయంలో రికార్డు అసిస్టెంట్‌గా పని చేస్తున్నారు. జడ్చర్ల సిగ్నల్‌గడ్డ ప్రాంతంలో ఇల్లు అద్దెకు తీసుకుని ఉంటున్నారు. దోనూరు గ్రామంలో నూతనంగా కట్టిన ఇల్లుకు, పిల్లల చదువు కోసం అప్పులు చేశాడని, చేసిన అప్పులు ఎలా తీర్చాలంటూ బాధపడేవాడు. గురువారం రాత్రి సైతం అప్పులు తీర్చలేనన్న బాధపడ్డాడు. శుక్రవారం ఉదయం 5 గంటలకు చూడగా, శ్రీను కనిపించకపోవడంతో భార్య కళావతి ఆచూకీ కోసం ప్రయత్నించింది. చెర్లపల్లికి వెళ్లే దారిలోని ఓ వెంచర్‌లో చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడగా, భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు సీఐ తెలిపారు.

ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే చర్యలు

- కలెక్టర్ విజయేందిర బోయి
- లక్ష్మీనగర్‌కాలనీ సర్వే నెం 247, 250 భూముల పరిశీలన



ఎస్సీ కార్పొరేషన్ భూములను పరిశీలిస్తున్న కలెక్టర్ విజయేందిర బోయి

మహబూబ్‌నగర్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత భూములు ఆక్రమిస్తే చర్యలు తప్పవని, భూములు ఆక్రమణకు గురికాకుండా చూడాలని కలెక్టర్ విజయేందిర బోయి జిల్లా అధికారులను ఆదేశించారు. శుక్రవారం వివిధ శాఖల అధికారులతో కలిసి జిల్లా కేంద్రంలోని లక్ష్మీనగర్ కాలనీ సర్వే నెం 247, 250లో ఎస్సీ కార్పొరేషన్‌కు కేటాయించిన 30 గుంటల భూమిని పరిశీలించారు. ఈ స్థలంలో ఎస్సీ హాస్టల్‌తో పాటు ఎస్సీ కార్పొరేషన్ అభివృద్ధికి స్థలం కేటాయించగా, గురువారం కలెక్టరేట్‌లో జరిగిన విజిలెన్స్ మానిటరింగ్ పీఓఏ చట్టం సమావేశంలో కమిటీ సభ్యులు ఇట్టి భూమి ఆక్రమణకు గురవుతుందని కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన కలెక్టర్, అదనపు కలెక్టర్లు శివేంద్రప్రతాప్, మధుసూదన్ నాయక్, ఆర్డీవో నవీన్, అర్బన్ తహసీల్దార్ ఘాన్సీరాం, ఎస్సీ కార్పొరేషన్ ఇన్‌చార్జి ఈడీ వెంకట్‌రెడ్డి, షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి సునీత, మునిసిపల్, ల్యాండ్ సర్వే అధికారులతో కలిసి స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్ అధికారులు వెంటనే సర్వే చేసి హద్దులు నిర్ణయించాలన్నారు. షెడ్యూల్డ్ కులాల శాఖ భూమి రక్షణకు ఫెన్సింగ్ ఏర్పాటు చేసుకోవాలని, ఆక్రమణలపై విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలన్నారు.

చిత్తడి నేలలను పరిరక్షించుకోవాలి

మహబూబ్‌నగర్ కలెక్టరేట్ : పర్యావరణ పరిరక్షణ, భూగర్భ జలాల పెరుగుదల దృష్ట్యా, చిత్తడి నేలలను పరిరక్షించుకోవడం అత్యంత అవసరమని కలెక్టర్ విజయేందిర బోయి అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌ని మినీ సమావేశ మందిరంలో కలెక్టర్ అధ్యక్షతన జిల్లా వెట్‌ల్యాండ్ కమిటీ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం చిత్తడి నేలల భౌగోళిక గుర్తింపు ప్రక్రియ వేగవంతం చేయాలన్నారు. ఇందుకోసం అటవీ, రెవెన్యూ శాఖ, పంచాయతీ రాజ్, ఇరిగేషన్, సర్వే విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేసి నిర్ణీత గడువులోపు గుర్తింపు ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. డీఎఫ్‌వో సత్యనారాయణ, డీఆర్డీవో నరసింహులు, వ్యవసాయ శాఖ అధికారి వెంకటేశ్వర్లు, పంచాయతీ రాజ్ ఈఈ శ్రీనివాస్‌రెడ్డి, మత్స్యశాఖ అధికారిణి రాధారోహిణి, డీపీవో నిఖిల పాల్గొన్నారు.

మోడల్ న్యూట్రీ గార్డెన్‌గా తీర్చిదిద్దాలి

చిన్నచింతకుంట : లాల్‌కోటలో న్యూట్రీ గార్డెన్ ఏర్పాటు అభినందనీయమని, దీన్ని మోడల్ న్యూటీ గార్డెన్‌గా రూపొందించాలని కలెక్టర్ విజయేందిర బోయి పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని లాల్‌కోట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను కలెక్టర్ సందర్శించి, పాఠశాలలో నిర్వహిస్తున్న న్యూట్రీ గార్డెన్ పరిశీలించి అభినందించారు. మోడల్ న్యూటీ గార్డెన్‌గా రూపొందించుటకు హార్టికల్చర్ శాఖ సహకారం తీసుకోవాలన్నారు. అనంతరం పాఠశాలలో ఏర్పాటు చేసిన ఖగోళ శాస్త్ర ప్రయోగశాలను సందర్శించి విద్యార్థులందరికీ ప్రయోగ విధానం, నైపుణ్యాలు రావాలని కోరారు. అనంతరం గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల పురోగతిని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. తహసీల్దార్ ఎల్లయ్య, ఎంపీడీవో సుధాకర్‌రెడ్డి, ఎంఈవో మురళికృష్ణ, పంచాయతీ కార్యదర్శి రాజు పాల్గొన్నారు.



నవాబ్‌పేటలో వందేమాతరం గీతం ఆలపిస్తున్న నాయకులు



రాజాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 150 సంఖ్యతో విద్యార్థులు

వందేమాతరం గీతం ఆలాపన



జడ్చర్ల పట్టణంలో ర్యాలీ నిర్వహించిన ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్‌సీసీ విద్యార్థులు

మహబూబ్‌నగర్ టౌన్/ రూరల్/ మహబూబ్‌నగర్ విద్యావిభాగం/ హన్వాడ/ దేవరకద్ర/ మిడ్జిల్/నవాబ్‌పేట/భూత్పూర్/కోయిలకొండ/రాజాపూర్/జడ్చర్ల నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : వందేమాతరం గీతం ఆవిర్భవించి 150 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల్లో శుక్రవారం వందేమాతరం గీతాలాపన నిర్వహించారు. సీనియర్ సిటిజన్ ఫోరం ప్రధాన కార్యదర్శి నస్కంటి నాగభూషణం ఆధ్వర్యంలో సీనియర్ సిటిజన్ ఫోరం కార్యాలయంలో భరత మాత చిత్రపటానికి పూజలు నిర్వహించి, వందేమాతరం గీతాన్ని ఆలపించారు. ఉపాధ్యక్షుడు రాజసింహుడు కోటిరెడ్డి, రాములు, మనోహర్‌రావు, లక్ష్మయ్య, ఈశ్వరయ్య, బుచ్చన్న, రవిపాల్ పాల్గొన్నారు. మహబూబ్‌నగర్ రూరల్ మండలం కోడూర్, ధర్మాపూర్, మణికొండ, గాజులపేట, ఫతేపూర్, వెంకటాపూర్ గ్రామాల్లోని ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాల్లో వందేమాతరం గీతం ఆలపించి దేశభక్తిని చాటుకున్నారు. హన్వాడ మండలంలోని అన్ని పాఠశాలలతో పాటు తహసీల్దార్, ఆసుపత్రి, మండల కార్యాలయాల్లో శుక్రవారం వందేమాతరం గేయాన్ని ఆలపించారు. దేవరకద్ర మండల కేంద్రంలోని తహసీల్దార్, ఎంపీడీవో, మునిసిపల్ కార్యాలయాల్లో ఎంపీడీవో శ్రీనివాసరావు, తహసీల్దార్ దీపిక, కమిషనర్ నరేష్‌బాబు వందేమాతం గీతాలాపన చేశారు. మిడ్జిల్ మండల కేంద్రంలోని గీతాలాపన వేడుకల్లో తహసీల్దార్ రాజు, ఎంపీడీవో గీతాంజలి, ఎస్ఐ శివనాగేశ్వర్‌నాయుడు పాల్గొన్నారు. కాంగ్రెస్ నాయకులు వెంకటయ్య, మల్లికార్జున్ రెడ్డి, సంపత్‌కుమార్, శివ పాల్గొన్నారు. బంకిన్ చంద్ర చటార్జి రచించిన వందేమాతరం గేయం మరువలేనిదని మార్కెట్ చైర్మన్ హరలింగం అన్నారు. శుక్రవారం నవాబ్‌పేట మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాల్లో వందేమాతరం గీతాన్ని ఆలపించి దేశ ఐక్యతను చాటారు. తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీవో జయరాములు, ఏవో కృష్ణ కిషోర్, మార్కెటింగ్ కార్యదర్శి రమేష్‌కుమార్, సీనియర్ సిటిజన్ ఫోరం సభ్యులు నర్సింహులు, వెంకటేశ్వరప్ప జాతీయ గీతాన్ని ఆలపించారు. భూత్పూర్ మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో ఉమాదేవి ఆధ్వర్యంలో, తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ కిషన్ ఆధ్వర్యంలో ఉద్యోగులు ఉదయం 10 గంటలకు వారివారి కార్యాలయాల్లో వందేమాతరం గీతాన్ని ఆలపించారు. సీఐ కార్యాలయంలో సీఐ రామకృష్ణ, పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ చంద్రశేఖర్ వందేమాతరం గీతాన్ని ఆలపించారు. సింగిల్ విండో కార్యదర్శి రత్నయ్య పాల్గొన్నారు. కోయిలకొండ మండల కేంద్రంతో పాటు రాజాపూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, కేజీబీవీ, ప్రభుత్వ కార్యాలయాల్లో వందేమాతరం గీతాలాపన చేశారు. జడ్చర్ల పట్టణంలోని తహసీల్దార్, మండల ప్రజా పరిషత్, మునిసిపల్ కార్యాలయం, ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలతో పాటు ప్రైవేట్ కార్యాలయాల్లో వందేమాతరం గీతాన్ని ఆలపించారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని ఎన్‌సీసీ విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. బాదేపల్లి వ్యవసాయ మార్కెట్ వద్ద పాలకవర్గం సభ్యులు వందేమాతరం గీతం ఆలపించారు.

రెండోరోజు ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ పర్యటన



విధుల వివరాలు తెలుసుకుటున్న ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ క్రిస్టిన

భూత్పూర్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ట్రైనీ డిప్యూటీ కలెక్టర్‌గా శిక్షణ పొందుతున్న క్రిస్టిన ఐదు రోజుల పాటు మండలంలోని వివిధ ప్రభుత్వ కార్యాలయాల్లో ఉద్యోగుల విధులు, నిధుల అమలుపై శిక్షణ పొందుతున్నారు. ఇందులో భాగంగా శుక్రవారం రెండో రోజు మండల పరిషత్ కార్యాయంలోని వివిధ సెక్షన్లల్లో ఉద్యోగులు నిర్వహిస్తున్న విధుల గురించి ఉద్యోగులను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలకు ప్రభుత్వం నుంచి అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుపై సంబంధిత శాఖ అధికారులతో ఆరా తీశారు. పింఛన్ల పంపిణీ, వాటి అమలు, ఏ సందర్భాల్లో పింఛన్లు తొలగిస్తారు? అసలు పింఛన్లు ఎలా మంజూరు చేస్తారు? అర్హులుగా ఎలా గుర్తిస్తారనే విషయాలను ఉద్యోగులను అడిగి తెలుసుకున్నారు. ఎంపీడీవో ఉమాదేవి, జూనియర్ అసిస్టెంట్ బాలరాజు, ఏపీవో విమల పాల్గొన్నారు.

మెనూ ప్రకారం భోజనం వడ్డిస్తున్నారా?

- అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్

ముసాపేట, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలను అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మెనూ ప్రకారం భోజనాలు వడ్డిస్తున్నారా? లేదా అనే విషయాలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అదే విధంగా విద్యార్థుల ప్రతిభను పరీక్షించారు. సమయాన్ని వృథా చేయకుండా ఎప్పటికప్పుడు చదువుకోవాలని, ఏవైన అర్థం కాకపోతే సంబంధిత ఉపాధ్యాయులను అడిగి నివృత్తి చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు.

పత్తి కొనుగోలు కేంద్రం ప్రారంభం

జడ్చర్ల, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : జడ్చర్ల మునిసిపాలిటీ ఇండస్ట్రీయల్ ఏరియాలోని పాలమూరు కాటన్ ఇండస్ట్రీస్ జిన్నింగ్ మిల్లులో సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాన్ని బాదేపల్లి మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ జ్యోతి, వైస్‌చైర్మన్ రాజేందర్‌గౌడ్ శుక్రవారం ప్రారంభించారు. మండలంలోని పత్తి రైతులు సీసీఐ కొనుగోలు కేంద్రంలో విక్ర యించి, ప్రభుత్వ మద్దతు ధర పొందాలన్నారు. మార్కెట్ కార్యదర్శి అశ్వక్‌అహ్మద్, సీసీఐ ఇన్‌చార్జి ఆశిష్, కాంగ్రెస్ నాయకులు బుర్ల వెంకటయ్య, నిత్యానందం పాల్గొన్నారు.

వసతి గృహాల తనిఖీ

నవాబ్‌పేట, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని యన్మనగండ్ల ప్రభుత్వ ఎస్సీ బాలుర, నవాబ్‌పేటలోని కేజీబీవీ పాఠశాలలను మండల ప్రత్యేకాధికారి సునిత, ఎంపీడీవో జయరాములు శుక్రవారం రాత్రి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రతీ విద్యార్థి అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. మెనూ ప్రకారం భోజనం పెట్టకపోతే సంబంధిత అధికారులపై చర్యలు తప్పవన్నారు.

కొనుగోలు కేంద్రాలు సద్వినియోగం చేసుకోవాలి



పారుపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అధికారులు

మహబూబ్‌నగర్ రూరల్/కోయిలకొండ/ గండీడ్/ దేవరకద్ర, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : వరి కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి మాజీ సర్పంచు గంగన్న అన్నారు. శుక్రవారం మండలంలోని మణికొండలో ఐకేపీ సీసీ రమేష్‌కుమార్ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి, మాట్లాడారు. గ్రామ కార్యదర్శి రఘుపతిరెడ్డి, ఏఈవో అనీఫ్, నాయకులు చంద్రశేఖర్, రాజప్ప, బస్వరాజ్ పాల్గొన్నారు. కోయిలకొండ మండలం పారుపల్లి, అనంతాపూర్, చంద్రాసుపల్లి, కొతలాబాద్ గ్రామాల్లో ఎంపీడీవో ధనుంజయగౌడ్, ఏవో యామారెడ్డి శుక్రవారం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. సింగిల్ విండో చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రవీందర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు విద్యాసాగర్‌గౌడ్, నాయకులు సత్యపాల్‌రెడ్డి, రవి నాయక్ పాల్గొన్నారు. గండీడ్ మండలం పెద్దవార్వాల్ గ్రామంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో పీఏసీఎస్ చైర్మన్ లక్ష్మినారాయణ, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు జితేందర్‌రెడ్డి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఎంపీడీవో మంజుల, ఫిషరీస్ ఏడీ రాధారోహిని, ఏవో రాధమ్మ, ఏఈవో శివలీల, సీఈవో ఆశన్న, డైరెక్టర్ బాలస్వామి, దిగంబర్‌రావు పంచాయతీ కార్యదర్శులు వెంకటేష్, సంజీవరెడ్డి పాల్గొన్నారు. దేవరకద్ర మండలం గద్దెగూడెంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు అంజిల్‌రెడ్డి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు.

ప్రతీ వసతి గృహాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతా



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ప్రతీ వసతి గృహాన్ని ఆదర్శంగా తీర్చిద్దుతానని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని కలెక్టర్ బంగ్లా సమీపంలో గల ఎస్సీ, బీసీ బాలికల వసతి గృహాలను ఆకస్మికంగా తనిఖీ చేసి, విద్యార్థులతో మాట్లాడారు. వసతి, భోజనం, విద్యా సౌకర్యాల వివరాలు అడిగి తెలుసుకున్నారు. వసతి గృహ ప్రాంగణంలో పార్కు, చిల్డ్రన్స్ ప్లేయింగ్ పరికరాలు ఏర్పాటు చేయాలని, బీసీ వసతి గృహం పై అంతస్తులో కొత్త హాల్ నిర్మాణానికి అంచనా సిద్ధం చేయాలని ముడా ఇంజనీరింగ్ విభాగం అధికారులను ఆదేశించారు. ఎస్సీ వసతి గృహ ప్రాంగణంలో సీసీ బెడ్ వేయాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు చర్యలు తీసుకోవాలని, లైబ్రరీ ఏర్పాటు చేయాలన్నారు. పోలీస్ లైన్ పాఠశాలను సందర్శించి, అక్కడ పది విద్యార్థులకు నిర్వహిస్తున్న శతశాతం కార్యక్రమంలో పాల్గొని విద్యార్థులతో మాట్లాడి వందశాతం ఫలితాలు నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహారెడ్డి, మహబూబ్‌నగర్ ఫస్ట్ పర్యవేక్షకుడు గుండా మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి



1104 యూనియన్ జెండాను ఆవిష్కరిస్తున్న రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాయిబాబా

హన్వాడ, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ రంగంలో పని చేస్తున్న కార్మికుల సమస్యల పరిష్కారానికి నిరంతరం పని చేస్తానని 1104 యూనియన్ రాష్ట్ర కార్యదర్శి సాయిబాబా అన్నారు. శుక్రవారం హన్వాడ సబ్‌స్టేషన్ ఆవరణలో 1104 యూనియన్ జెండా ఆవిష్కరణ కార్యక్రమం సెక్షన్ అధ్యక్షుడు జనార్దన్ ఆధ్వర్యంలో నిర్వహించగా, ఆయన ముఖ్య అతిథిగా హాజరై జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. ఆర్టిసన్స్ కార్మికుల సమస్యల పరిష్కారానికి యాజమాన్యంతో మాట్లాడి పరిష్కరిస్తానన్నారు. అంతకుముందు సాయిబాబాను ఘనంగా సన్మానించారు. యూనియన్ జిల్లా అధ్యక్షుడు స్వామి, పాండు, విజయ్‌కుమార్, సోమేష్, ట్రాన్స్‌కో జిల్లా కార్యదర్శి రాఘ వేందర్‌గౌడ్, డివిజన్, సెక్షన్ నాయకులు శ్రీనువాసులు, కృష్ణశేఖర్, యాదయ్యగౌడ్ హన్వాడ, మహమ్మదాబాద్, కోయిలకొండ జేఎల్ఎంలు పాల్గొన్నారు.

మత్స్యకారుల సంక్షేమానికి పెద్దపీట



సాలార్‌నగర్ ప్రాజెక్టులో చేప పిల్లలు వదులుతున్న అధికారులు

గండీడ్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : మత్స్యకారుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని కాంగ్రెస్ మండలాధ్యక్షుడు జితేందర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ లక్ష్మీనారాయణ అన్నారు. శుక్రవారం మండలంలోని సాలానగర్ ప్రాజెక్ట్‌లో చేపపిల్లలను వదిలారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి 7.78 లక్షల చేప పిల్లలు మంజూరు కాగా, 1.80 లక్షల చేప పిల్లలు వదిలామని, మిగతావి రెండు మూడు రోజుల్లో వదలనున్నట్లు తెలిపారు. ఫిషరీష్ ఏడీ రాధా రోహిణి, ఎంపీడీవో మంజుల, ఫీల్డ్‌మెన్ నవీన్‌కుమార్, అస్లాం, అంజిలయ్య, సాయిలు, దిగంబర్‌రావు, ఆంజనేయులు గౌడ్, నర్సిములుగౌడ్, మత్స్యసహకార సంఘం అధ్యక్షుడు నారాయణ, సంఘం సభ్యులు ఆంజనేయులు, యాదయ్య, నర్సింహులు, శ్రీను పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

జడ్చర్ల, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : చట్టాలపై ప్రతీ విద్యార్థి అవగాహన కలిగి ఉండాలని జడ్చర్ల జూనియర్ సివిల్ న్యాయాధికారి ముదస్సిర్ అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ బీసీ బాలికల కళాశాల వసతి గృహంలో శుక్రవారం జాతీయ న్యాయ సేవా దినోత్సవం పురస్కరించుకుని నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో పాల్గొని, మాట్లాడారు. న్యాయ సేవ దినోత్సవం అనేది 1987లో ఏర్పాటైందని, 1995 నవంబరు 9న అమలులోకి వచ్చిందని వివరించారు. ప్రజలకు ఉచిత న్యాయ సహాయం అందించడం, న్యాయస్థానాల పరిధిలో లోక్‌అదాలత్‌లను నిర్వహించడం, ఉచిత న్యాయ సలహా శిబిరాలు ఏర్పాటు చేయడం అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఫోక్సో చట్టం, బాల్య వివాహాల నిరోధక చట్టం, బాలకార్మికుల చట్టం, నిర్బంధ విద్య చట్టం, మోటార్ వెహికల్, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. జడ్చర్ల బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మాలిక్ షాకీర్, న్యాయవాదులు ప్రశాంత్, విశ్వేశ్వర్, పురుషోత్తంరావు, సాహితి రెడ్డి, శంకరాచారి, పాండు, అజహరుద్దీన్, హస్టల్ వార్డెన్ వసంత పాల్గొన్నారు.

నాలా పర్మిషన్ రద్దు చేసే వరకు నిరసన

మహమ్మదాబాద్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : నవజీవన రీ క్రియేషన్ క్లబ్ స్థలాన్ని రక్షించుకునే వరకు పోరాటం ఆగదని రక్షణ కమిటీ సభ్యులు దిడ్డికాడి గోపాల్, మాజీ సర్పంచ్ రాజేశ్వర్, దస్తయ్య, కుర్వ కృష్ణ డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలోని వివాదాస్పద స్థలం వద్ద అక్రమ నాలా పర్మిషన్ రద్దు చేయాలని గ్రామస్థులు, యువజన సంఘాల సభ్యులు కళ్లకు నల్ల రిబ్బన్ కట్టుకుని నిరసనకు దిగారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొందరు రెవెన్యూ అధికారులు మండల కేంద్రలో నడి బొడ్డున ఉన్న స్థలానికి నాలా పర్మిషన్ ఇచ్చారని, దీన్ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో చితకింది కేశవులు, వడ్ల వెంకటయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

పాలమూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ర్యాంకుతో సంబంధం లేకుండా బీసీ విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇస్తామని చెప్పి నేటికీ విడుదల చేయలేదని బీసీ జాగృతి సేన రాష్ట్ర అధ్యక్షుడు బూర్గుపల్లి కృష్ణయాదవ్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో బీసీ విద్యార్థి సంఘం నాయకులతో ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన హాజరై ప్రసంగించారు. విద్యార్థుల జీవితాలను రోడ్డుమీద పడేసి జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలకు పోవటం అవసరమా? అని ప్రశ్నించారు. అన్ని రంగాల్లో బీసీలకు అన్యాయం చేయటమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. బీసీ రిజర్వేషన్ అమలు చేసి స్థానిక ఎన్నికలు నిర్వహించాలన్నారు. వెంకటేష్, శివాజీ, నరేందర్ పాల్గొన్నారు.

విద్యార్థులు భాగస్వాములు కావాలి



వెన్నచేడులో యంగ్ ఎర్త్ లీడర్స్ ప్రోగ్రాంలో పాల్గొన్న నిర్వాహకులు

గండీడ్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : పర్యావరణ సమస్యలను పరిష్కరించడంలో ప్రతీ విద్యార్థి భాగస్వాములు కావాలని సీజీఆర్ అసిస్టెంట్ డైరెక్టర్ అన్నమయ్య, ఎస్సీఆర్టీ ప్రభుత్వ పాఠ్యపుస్తక రచయిత రమేష్, రిటైర్డ్ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ రఫీయోద్దీన్ అన్నారు. శుక్రవారం మండలంలోని వెన్నచేడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 300 ఏళ్ల నాటి రావి చెట్టును విద్యార్థులకు చూయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇది పురాతన వృక్షం మదర్ ట్రీగా ప్రకటించి విద్యార్థుల సమక్షంలో పూజ నిర్వహించారు. అనంతరం ఔషధ మొక్కల తోటను ప్రారంభించి ప్రాముఖ్యతను తెలియజేశారు. ఇంకుడు గుంతల ఆవశ్యకతను వివరించారు. పాఠశాల విద్యాశాఖ, కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ మరియు నాబార్డ్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించగా, పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం మల్లికార్జున్, రమేష్ పాల్గొన్నారు.